# హిందూత్వ రాజకీయాలు - సామాజిక మూలాలు

రాణి శివశంకర శర్మ

నూరు పూలు వికసించనీ..
వేయి ఆలోచనలు సంఘర్షించనీ...

# హిందూత్వ రాజకీయాలు – సామాజిక మూలాలు

రాణి శివశంకర శర్మ

బి.చంద్ర శేఖర్ స్మారకోపాన్యాసం



ప్రచురణ

భిన్నస్వరాలు

సాహితీ సాంస్కృతిక వేదిక

తెనాలి

# హిందూత్వరాజకీయాలు – సామాజిక మూలాలు

**రాణి శివశంకర శర్మ**

బి.చంద్ర శేఖర్ స్మారకోపాన్యాసం

ప్రచురణ : భిన్నస్వరాలు, తెనాలి

ప్రథమ ముద్రణ : మే 2018

కవర్ డిజైనింగ్, బుక్ మేకింగ్ : జుగాష్ విలి

డిటిపి : శ్రీ సోమ డిజైన్స్, హైద్రాబాద్

ప్రతులకు : జి.యస్. నాగేశ్వరరావు, అడ్వకేట్

ఎన్జీఓ హోమ్ అప్‌స్టెర్స్, కొత్తపేట,

తెనాలి – 522201, ఆంధ్రప్రదేశ్.

సెల్ : 7981582808, 9703759523.

మరియు అన్ని ప్రముఖ పుస్తక విక్రయ కేంద్రాలు

వెల : రూ. 40/–

# నూరుపూలు వికసించనీ...

చంద్రశేఖర్ వ్యక్తి కాదు. భిన్నాభిప్రాయాల వ్యక్తీకరణ. కేవలం న్యాయవాది మాత్రమే కాదు. అన్యాయంపై దూసిన ఖడ్గం. కులతత్వానికి వెన్నులో వణుకు పుట్టించిన దళితుల కంఠస్వరం. చుండూరు దళితుల పక్షాన కోర్టులో పోరాడి గెలుస్తూ, అర్ధాంతరంగా అస్తమించిన ప్రచండ భానుడు. ఇది చంద్రశేఖర్‌కి వొక పార్శ్వం మాత్రమే.

చంద్రశేఖర్ మరోవైపు మొత్తంగా ఆధునికతనే ప్రశ్నించాడు. ఆధునికతని ప్రశ్నించే క్రమంలో అద్వైత వేదాంతాన్నీ, సనాతన సంస్కృతినీ, సంస్కృత భాషనీ అధ్యయనం చేయడం మొదలు పెట్టాడు. ఈక్రమంలో రాణి శివశంకర శర్మ భావాల పట్ల, 'ది లాస్ట్ బ్రాహ్మిన్' గ్రంథం పట్ల ప్రత్యేక ఆసక్తిని కనబరిచాడు. 'హిందూత్వ' అనేది ప్రచ్ఛన్న క్రైస్తవం, పూర్తి ఆధునికం అనే అవగాహనకి వచ్చాడు.

"సంస్కర్తలూ, ఆధునిక మేధావులూ ప్రపంచాన్ని తొందరపాటుతో నిరంతర మార్పుకి గురి చెయ్యాలని ప్రయత్నిస్తూ వచ్చారు. అసలు చెయ్యవలసినది ప్రపంచాన్ని సరైన పద్ధతిలో వ్యాఖ్యానించడం" అనే అభిప్రాయానికి చంద్రశేఖర్ వచ్చాడు.

'హిందూత్వ' ప్రాపంచిక దృక్పథం గురించి యిప్పటి వరకు వున్న వ్యాఖ్యానాలు అసంపూర్ణమైనవే కాదు, అసంబద్ధమైనవి కూడా. ఇదీ రాణి శివశంకర శర్మ అభిప్రాయం. శర్మ అభిప్రాయాలతో చంద్రశేఖర్‌కి ఏకాభిప్రాయం వుంది.

బుద్ధిజం నుండి గాంధీజం దాకా, మార్క్సిజం నుండి అంబేడ్కరిజందాకా, విప్లవోద్యమాల నుండి అస్థిత్వ ఉద్యమాలదాకా అందరూ ఎవరి పద్ధతుల్లో వాళ్ళు సమాజాన్ని మానవీకరించే ప్రయత్నాలు చేస్తున్నారు. సమాజాన్ని మానవీకరించే కృషి బహుముఖాలుగా

నిరంతరం జరుగుతూనే ఉంటుంది. వీటిలో ఏ ఒక్క ధోరణో సమాజంలోని అన్ని రుగ్మతలను పరిష్కరించగలదని అనుకోవడానికి ఆస్కారం లేదని మా 'భిన్న స్వరాల' ఏకాభిప్రాయం.

ప్రస్తుతం సమాజాన్ని అమానవీకరించే కృషిని 'హిందూత్వ' పెద్దఎత్తున చేస్తుంది. 'హిందూత్వ' రాజకీయాలపై పలుకోణాలనుంచి విమర్శలున్నాయి. కానీ 'హిందూత్వ' అనేది భారతీయ సంస్కృతికి వ్యతిరేకమని, భారతీయ సంస్కృతికి, దానికీ ఏ మాత్రం సంబంధం లేదని దాని బీజాలు వలసవాద ఆధునికతలో ఉన్నాయని ఒక కొత్త గొంతుకను రాణి శివశంకర శర్మ వినిపిస్తున్నారు.

వివిధ సామాజిక, సాహిత్య అంశాలపై, ఉద్యమాలపై విభిన్న స్వరాలను వినిపించడం, ప్రత్యామ్నాయ ప్రతిపాదనలను చర్చించడం తమ బాధ్యతగా 'భిన్న స్వరాలు' సుదీర్ఘ కాలం నుంచి కృషి చేస్తుంది. విస్తృతంగా చర్చ జరగాల్సిన అవసరం ఉందని భావించిన ప్రసంగ పాఠాలను ప్రాధాన్యతను బట్టి ఇకముందు చిన్న చిన్న పుస్తకాలుగా తీసుకురావాలని భావించింది. ఇది తొలి ప్రయత్నం.

13 జనవరి 2018 న తెనాలిలో 'హిందూత్వ రాజకీయాలు – సామాజిక మూలాలు' అనే అంశంపై రాణి శివశంకర శర్మ చేసిన చంద్రశేఖర్ స్మారకోపన్యాసం యిది.

దీనిపై విస్తృత చర్చ జరుగుతుందని ఆశిస్తున్నాం.

**భిన్న స్వరాలు**

సాహితీ సాంస్కృతిక వేదిక

తెనాలి

# హిందూత్వ రాజకీయాలు – సామాజిక మూలాలు

## రాణి శివశంకర శర్మ

'హిందూ' అనేది వొక రాజకీయపదం. 'హిందూ' అనే పదాన్ని మనం పలికినప్పుడు ఆధ్యాత్మిక అర్థం కంటే, మతపరమైన అర్థం కంటే రాజకీయమే మొట్టమొదలు స్ఫురిస్తుంది. నేను హిందువుని అని ప్రకటించుకోవడం ప్రధానంగా వొక రాజకీయ ప్రకటన.

హిందువు అనిపించుకోవడానికి కొందరు క్రికెట్టుని ఆశ్రయిస్తారు. మరికొందరు దేశభక్తిని, జాతీయతని ఆసరాగా తీసుకొంటారు. తోటిదేశం పట్ల ద్వేషపూరిత ప్రకటనలు 'హిందూత్వ'లో అనివార్య భాగం. అంతేకాదు పాశ్చాత్య అమెరికా దేశాల అంతర్జాతీయ రాజకీయాల పట్ల సానుకూల దృక్పథం అనేది యిందులో అనివార్య భాగం. అమెరికా దుందుడుకు యుద్ధవైఖరిని సమర్థించడం హిందూత్వలో ప్రధానం.

హిందూత్వ అనేది ఎందుకు యింతగా రాజకీయ రంగు పులుముకొంది? పైగా దాని రాజకీయం యితర మత రాజకీయాల వంటిది కాదు. ఉదాహరణకి అమెరికా, పాశ్చాత్య దేశాలు ముస్లిందేశాలపై కాలుదువ్వుతూ వుంటాయి. దానిలో చమురు రాజకీయం వున్న మాట నిజమే. భౌతిక ప్రయోజనాలు వున్నమాట నిజమే. కాని ఇస్లాంతో వున్న మత పరమైన విభేదం, క్రూసేడ్ల కాలం నుంచి ఉన్న ద్వేషభావం కూడా ధ్వనిస్తుంది. అలాగే ఇజ్రాయిల్‌నీ, యూదులనీ సమర్థించడంలో, ఇజ్రాయిల్ యూదుల దైవదత్త భూమి అనే బైబిలు బోధ తక్కున తడ్తుంది. నిజానికి ప్రొటెస్టెంటు క్రైస్తవులు అలా ప్రచారం చేస్తూ వచ్చారు కూడా.

ఈ మొత్తం అంతర్జాతీయ నాటకంలో హిందూత్వ పాత్ర ఏమిటి? ఎందుకు హిందూత్వవాదులు పాశ్చాత్య, అమెరికన్ సానుకూలవైఖరిని ప్రదర్శిస్తారు? అదే సమయంలో ముస్లిం ద్వేషాన్ని యెందువల్ల కలిగివుంటారు! ఈ సత్యాన్ని గ్రహించడానికి మనకి భారతీయ మత, ఆధ్యాత్మిక గ్రంథాలు ఏమాత్రం తోడ్పడవు. పైగా ఆటంకంగా నిలుస్తాయి. మనం భగవద్గీతనో, వేదాలనో విశ్లేషిస్తూ కూర్చుంటే హిందూత్వాన్ని అర్థం చేసుకోవడంలో పూర్తిగా దారితప్పి పోతాం. ఎందుకంటే హిందూత్వలో రాజకీయ కోణం ప్రధానమైనది!

ఏమిటా రాజకీయ కోణం? 'హిందూత్వ' బ్రిటీషు వలసవాద శిశువు. 'హిందూత్వ' అనే పదానికి తండ్రి అనదగిన వీరసావర్కర్ బ్రిటీష్ వారికి సర్వాత్మనా లొంగిపోయి పశ్చాత్తాపం ప్రకటించాకే, హిందూత్వకి ప్రవక్తగా మారాడు. క్రైస్తవులు క్రీస్తుని సర్వాత్మనా నమ్మడం ద్వారా మాత్రమే మనిషి పాపం నుంచి విముక్తి పొందగలడని విశ్వసిస్తారు. తమ పాపాలని క్షమించమని దేవుడిని వేడుకోవడం అత్యంత ప్రధానమైన విషయం. సావర్కర్ బ్రిటీష్ వారికి ఎదురు తిరగడమనే తప్పు చేశాడు. ఆ తప్పుని క్షమించమని కన్నీళ్లతో వేడుకున్నాడు.

ఎందువలనంటే – బ్రిటీషు వారిని కాపాడడానికి దేవుడు వున్నాడు. మనని కాపాడడానికి, వుద్ధరించడానికి వచ్చిన దైవ దూతలే బ్రిటీషు వారు. యిటువంటి అభిప్రాయం ఆ రోజుల్లో చాలా మందికి వుండేది. బ్రిటీషు వారి రాక దైవ సంకల్పమని చాలామంది భావించారు. వందేమాతరం గీతరచయిత బంకించంద్ర చటర్జీ అలాగే భావించాడు. ముస్లింల నియంతృత్వ పాలన నుంచి విముక్తం చేయడానికి ఈశ్వరుడే బ్రిటీషువారిని పంపారని బంకించంద్ర అన్నాడు. వీరేశలింగం పంతులు కూడా బ్రిటీషువారి రాకని దైవ సంకల్పంగానే భావించాడు. బ్రిటీషువారికి దేవుడు వున్నాడు. మనని వుద్ధరించడానికి తెల్లవాడు వున్నాడు. బ్రిటీషువాడికి దేవుడే తండ్రి, పరమపిత. మన పరమపిత తెల్లవాడు.

అందుకే విరసం రచయిత కేవీఆర్ తెల్లవారి రాకతో తెల్లవారిందని అన్నాడు. అంతక్రితం అంతా చీకటేనని వాపోయాడు. బ్రిటీష్ వారు హింసాత్మకంగానైన భారతీయ స్తబ్ధ గ్రామీణ సమాజంలో చలనశీలత, పురోగతినీ తీసుకురాగలరని సాక్షాత్తూ కార్ల్‌మార్క్స్ అన్నాడు. బ్రిటీష్ విద్య, బ్రిటీష్ వారి ప్రభావం భారతీయులలో అటువంటి వైఖరినే బలపరిచింది.

యీ వైఖరిని ముందుకు తీసుకువెళ్లే క్రమంలోనే హిందూత్వ జన్మించింది. 'హిందూత్వ' బ్రిటీష్ వారిపై ద్వేషాన్ని దారి మళ్లించి, పూర్తిగా ముస్లింలపైకి ఫోకస్ చేసింది. సావర్కర్ తన తీవ్ర బ్రిటీష్ ద్వేషాన్ని విడిచిపెట్టి పశ్చాత్తాపాన్ని ప్రకటించి, తన విద్వేషాన్ని ముస్లింలపైకి ఎక్కుపెట్టాడు. ఆ ముస్లిం ద్వేషం నుంచి 'హిందూత్వ' పుట్టింది.

అందువల్ల హిందూ అనేది వొక స్వతంత్రపదం కాదు. అది ముస్లింకి వ్యతిరేక పదం. ముస్లిం అనే పదం లేనిదే హిందూ అనే పదం లేదు. నిజానికి ఆ పదాన్ని ముస్లిం ప్రభువులే వాడుకలోకి తెచ్చారు. అందువల్ల ముస్లిం కమ్యూనిటీకి వొక హెచ్చరికగా అదే పదాన్ని వుపయోగించడం యాదృచ్ఛికం ఏమాత్రం కాదు. అందువల్ల హిందూ – ముస్లిం అనే పదాలు బైనరీ ఆపోజిట్స్‌గా ఆవిర్భవించాయి. వాటిని విడదీయడం అసాధ్యం. అందువల్ల నేను హిందువుని అని ప్రకటించుకోవడం నేను ముస్లిం ద్వేషిని అని ప్రకటించుకోవడంతో సమానం. అందువల్ల క్రికెట్టు, దేశభక్తి (ముస్లిం దేశం పట్ల ద్వేషం) లాంటివి రిచ్యువల్స్‌గా అవతరించాయి.

అందువల్ల మనం హిందూత్వని ప్రాచీన సాంస్కృతిక వారసత్వం నుంచి విడదీసి చూస్తే కాని అర్థం చేసుకోలేం. మరి మనం హిందూత్వని అర్థం చేసుకోవడానికి, అధ్యయనం చేయడానికి ఎటువంటి పరికరాలని వుపయోగించాలి? అవి ఎక్కడ లభిస్తాయి?

హిందూత్వ అనేది బ్రిటీషు వలసవాదం నుంచి పుట్టింది. కనుక దాని పుట్టు పూర్వోత్తరాలని తెల్లవారి పరికరాలతోనే వెతకాలి. బ్రిటీషు వారు తమతో తెచ్చిన హిస్టరోగ్రఫీ యిందుకు మనకు వుపయోగపడుతుంది.

## మనం చరిత్రను ఎలా చూశాం?

శ్రీశ్రీ దేశచరిత్రలు అనే కవిత రాశాడు. నాదిర్షా, గజినీ, గోరీలని మహా హంతకులుగా ప్రకటిస్తాడు. కానీ ఆ కవితలో వొక్క బ్రిటీషు హంతకుడి పేరు కూడా వుండదు. ఇతరులతో పాటు ముస్లిం రాజుల పేర్లు మాత్రమే కనబడ్తాయి. చివరికి జలియన్ వాలాబాగ్ హంతకుడు డయ్యర్ పేరుకూడా కనబడక పోవడం విశేషం.

ఐతే యీ ప్రశ్న యింతవరకు యెవరికీ తట్టలేదు. పైగా శ్రీశ్రీ కవిత్వంలో హిందూ ప్రతీకలు వున్నాయని తప్పుపట్టాడు ముస్లిం కవి ఖాదర్ మొయిద్దీన్. ఈయన వుద్దేశంలో హిందూ ప్రతీకలు అంటే పురాణ ప్రతీకలు. హరోం హర, దుర్గ వగైరా.కాని అవి హిందూ ప్రతీకలు కావు. సనాతన పురాణ ప్రతీకలు మాత్రమే.

అసలు 'హిందూత్వ' ఎక్కడుందంటే – ముస్లిం రాజులని మాత్రమే హంతకులుగా పేర్కొనడంలో వుంది. ఇంగ్లీషు దొరల పేర్లని మినహాయించడంలో వుంది. శ్రీశ్రీ అలా ఎందుకు చేశాడు? గురజాడ అడుగుజాడల్లో నడవడం వల్ల. గురజాడ బ్రిటీష్ పరిపాలనా కాలాన్ని 'వచ్చెనిదె బంగారు కాలం' అని స్వర్ణయుగంగా కీర్తించాడు. 'కన్నుగానని వస్తుతత్వము కాంచగల్గుదు రింగిలీజులు' అని పొగిడాడు. మార్క్సు కూడా ఏ తురకవాడో భారత దేశాన్ని జయించడం కంటే యింగ్లీషువాడు జయించడం మంచిదైంది అన్నాడు.

యిటువంటి వలస మేధావుల దృష్టిలో బ్రిటీషు దొరలు భారతీయులని హింసించవచ్చును గాక. కాని వారు జ్ఞానపూర్ణులు, నాగరికులు. కనుక వారి హింసలో పురోగమనం వుంది. అందువల్ల బ్రిటీష్‌వారు ప్రయోగించే హింస యెంత తీవ్రమైనదైనప్పటికీ వొక గురువు, తండ్రి, పరమపిత దేవుడు విధించే శిక్షగా శిక్షణగా భావించాలి. కాని బ్రిటీష్ వారి రాకకు ముందు హింస అంటే ముస్లిం ప్రభువుల హింస. అనాగరికమైనది. ముస్లిం ప్రభువులు హింసని ప్రయోగించారనేది అసలు విషయం కాదు. వారు నాగరికులు కాదు అనేది ప్రధాన అభియోగం.

బ్రిటీష్ వారు తమతో పాటు అత్యాధునిక టెక్నాలజీని తెచ్చారు. వారు బైబిలుతో పాటు తుపాకీని కూడా తీసుకువచ్చారు. టెక్నాలజీ పెరిగేకొలది హింస తీవ్రత పెరుగుతుంది. ఆక్రమణ సులభమవుతుంది. కాని హింసలోని అనాగరికత బర్బరీకత అదృశ్యమవుతుంది.

అమెరికా గల్ఫ్ దేశాలపై చేసే యుద్ధాలే చూడండి. అక్కడ చావులకంటే అమెరికా వుపయోగించే యుద్ధ టెక్నాలజీ మనని ఆకర్షిస్తుంది. యిటీవల అమెరికా తీవ్ర నష్టాన్ని కలిగించే భయంకరమైన బాంబుకి 'అమ్మ బాంబు' అని పేరు పెట్టింది. కమ్యూనికేషన్ టెక్నాలజీ కానీ మరే టెక్నాలజీ కానీ పాశ్చాత్య దేశాల వలస దురాక్రమణ యుద్ధాలలో భాగంగానే అభివృద్ధి చెందాయి.

అందువల్ల వారి టెక్నాలజీ కూడా బ్రిటీష్ వారిని నాగరికులుగా పురోగమన శీలురుగా చూడడానికి కారణమైంది. తెల్లవాళ్లు వుపయోగించిన అత్యాధునిక హింసనుండి ఆధునిక అమెరికా ఆవిర్భవించింది.

వలస వాద బానిసత్వం నుంచి ఆవిర్భవించిన హిందూత్వకి నిజమైన దైవం తెల్లవాళ్ళ టెక్నాలజీయే. 'కన్యాశుల్కం'లో అగ్ని హోత్రావధానులు అనే ఛాందస వైదిక బ్రాహ్మణుడు "అన్నీ మన వేదాల్లోనే వున్నాయిష" అంటాడు. నిజానికి వేదాలలో టెక్నాలజీ వుందని

వాదించిన వాళ్లు ఆధునిక సంస్కర్తలు. ఆర్య సమాజ్ వ్యవస్థాపకుడైన దయానంద సరస్వతి – వేదాలలో సైన్సు, టెక్నాలజీ వున్నాయన్నాడు. శ్రీకృష్ణుడు ఎలక్ట్రిక్ బోటులో ప్రయాణించాడు అన్నాడు. ఇటీవల మోడి, విఘ్నేశ్వరుడికి ప్లాస్టిక్ సర్జరీ చేసి, ఏనుగు తల అతికించారన్నాడు. సైన్సు కాన్ఫరెన్సులో కూడా వేదాలలో సైన్సు టెక్నాలజీల గురించి పేపర్లు సమర్పించడం వివాదమైంది.

నిజానికి భారతదేశంలో ఎదిగిన విజ్ఞాన శాఖల గురించి పరిశోధించిన వారు చాలామందే వున్నారు. అది వేరే సంగతి కాని అత్యాధునిక పాశ్చాత్య టెక్నాలజీని ప్రాచీన గ్రంథాలలో వెతకడంలో ఎటువంటి తాత్విక గాఢత, బుద్ధికుశలత కనబడదు. భౌతిక ప్రయోజనమూ కనబడదు.

మనం స్వయంగా ఆవిష్కరించిన విజ్ఞానశాస్త్ర సత్యాలు కొన్ని వున్నాయి. జామెట్రిలో, గణితంలో, వైద్యంలో భారతీయులు స్వయంగా సాధించిన విజయాలు కొన్ని వున్నాయి. వాటిని స్వతంత్ర పరిశీలనకు గురిచెయ్యవచ్చు. కాని సూపర్ మార్కెట్టులోని అన్ని వస్తువులూ వేదంలో వున్నాయి అని చెప్పడంలో బుద్ధి కుశలత ఏమాత్రమూలేదు. మనం వలసవాద బానిసత్వం వల్ల స్వతంత్ర ఆలోచనా శక్తిని కోల్పోయామని మాత్రమే దీనివల్ల స్పష్టమౌతుంది.

యిందుకు భిన్నంగా ఆధునిక సైన్సుని థియాలజీకి అన్వయించడంలో కొన్నిసార్లు క్రైస్తవుల బుద్ధికుశలత బయటపడ్తుంది. ఉదాహరణకి రోమన్ కేథలిక్ చర్చి బిగ్ బ్యాంగ్ థియరీని క్రైస్తవ క్రియేషనిజానికి తార్కాణంగా చూపింది. సృష్టికి ఆది వుందని బిగ్ బ్యాంగ్ థియరీవల్ల స్పష్టమౌతోంది. సృష్టికి ఆది వుంటే సృష్టికర్త వున్నాడని రుజువు చేయవచ్చునని చర్చి భావించింది. స్టీఫెన్ హాకింగు కూడా సృష్టికి మొదలు అనేది వుంటే, దేవుడు వునికికి అవకాశం వుంటుంది కాని ఆది లేదు అని తేల్చేస్తాడు.

యిక్కడ క్రైస్తవులు సైన్సుని గురించి మాట్లాడడంలో వొక తర్కంవుంది. వారిదైన సిద్ధాంతాన్ని నిరూపించుకొనే ప్రయత్నం వుంది. అంటే వొక స్వతంత్రబుద్ధి, తమదైన సాంస్కృతిక మతపర నేపథ్యం వున్నాయి.

కాని మన వాళ్లు వేదాలలో అన్నీ వున్నాయి అనడంలో అటువంటి తాత్విక గాఢత, బుద్ధి చతురత కనబడదు. హిందూవాదులు కాస్మాలజీ, బేసిక్ సైన్సు సూత్రాల గురించి కంటే, టెక్నాలజీ వేదాలలో వుంది అని చెప్పడానికే యెక్కువగా ప్రయత్నిస్తున్నారు కాని క్రైస్తవులు తమ కాస్మాలజీని నిరూపించుకోవడం కోసం సైన్సుని వుపయోగించు

కుంటున్నారు. దీని వల్ల క్రైస్తవులు విశాల దృష్టిని కనబరుస్తున్నారని అర్థమౌతుంది. యీ తేడాకి కారణమేమిటి?

దీనికి కారణం – మనం మొదటినుంచి వలసవాదులను గుడ్డిగా అనుకరిస్తూ స్వతంత్ర ఆలోచనని కోల్పోవడమే. దయానంద సరస్వతి ప్రాచీన భారతంలో టెక్నాలజీ వుందని వాదించడంతో సంతృప్తి చెందాడు. అసలు ఆర్యసమాజ్ ప్రయత్నమంతా వొక క్రైస్తవ తరహా మత నమూనాని భారతదేశంలో స్థాపించడమే. అందుకే ప్రొటెస్టెంట్లు బ్యాక్ టు బైబిల్ అంటే, దయానంద సరస్వతి బ్యాక్ టు వేదాస్ అన్నాడు. బైబిల్ ప్రకారం యూదుల వాగ్దత్తభూమి యిజ్రాయిల్ ఐతే, భారతదేశం ఆర్యుల వాగ్దత్త భూమి అన్నాడు. వొకే గ్రంథం వొకే దేవుడుకోసం తపించాడు. యిది పూర్తిగా క్రైస్తవ అనుకరణ. ఈ అనుకరణ వల్ల మనదైనదేముందో తెలియకుండా పోయింది. మనదైన సైన్సు, మనదైన కాస్మాలజీ, మనదైన ప్రాపంచిక దృక్పథం కోసం అన్వేషణ లేకుండా పోయింది.

యీ తాత్విక శూన్యతకి అంతిమ పర్యవసానం వివేకానందస్వామి. వివేకానంద హిందూ అనే పదాన్ని వొక మతంగా ప్రచారంలోకి తీసుకువచ్చాడు. వివేకానంద చేసిన అతి ముఖ్యమైన క్రింది ప్రకటన మనం యెంతగా వలసవాద వూబిలోకి కూరుకుపోయామో స్పష్టం చేస్తుంది.

"భారతీయులు పాశ్చాత్యుల నుంచి భౌతికతని, సైన్సునీ, ప్రాక్టికాలిటీని నేర్చుకోవాలి. పాశ్చాత్యులు భారతీయుల నుంచి ఆధ్యాత్మికతని తెలుసుకోవాలి"

నిజానికి యీ ప్రకటన పాశ్చాత్య దృక్పథ ప్రతి ఫలనం మాత్రమే. భారతీయులకి భౌతిక దృక్పథం శూన్యమని, వాళ్లు యెప్పుడూ ఆధ్యాత్మిక చింతనలో మునిగి తేల్తుంటారు అని, అంతర్ముఖులు అని పాశ్చాత్యులు ప్రకటించారు. దీనివల్ల భారతీయులు స్వయంపాలనకి అనర్హులు అనే భావం కూడా దాగివుంది. యీ బానిస భావజాలాన్ని వివేకానంద హిందూ భావజాలంగా మలిచాడు.

నిజానికి యీ ప్రకటనలో భారతీయ తాత్విక దృక్పథానికి పూర్తి విరుద్ధమైన అంశం వొకటి వుంది. అది భౌతికతనీ ఆధ్యాత్మికతనీ పూర్తి భిన్నమైనవిగా ప్రకటించడం. యిది క్రైస్తవ దృక్పథంలోకి ప్రయాణం. క్రైస్తవం ప్రకారం భూమి భౌతికం, పరలోకం ఆధ్యాత్మికం. భారతీయ సనాతన దృక్పథం ప్రకారం – యిహంలోనే పరం వుంది. పరమాత్మ సర్వాంతర్యామి. అంటే వివేకానంద క్రైస్తవాన్ని పోలిన ఆధ్యాత్మికతని ప్రకటిస్తున్నాడు. అంతిమంగా మనకి అనుకరణశీలత తప్ప స్వతంత్రబుద్ధి లేదని స్పష్టం చేస్తున్నాడు. యిది పరకీయతకి రహదారి.

భగవద్గీత కన్న ఫుట్‌బాల్ గొప్పది అని వివేకానంద వొక పాశ్చాత్య క్రీడని గీతకి పోటీపెట్టాడు. నిజానికి భారతదేశంలో అనేక స్థానిక క్రీడలు వున్నాయి. కాని అవి వలసవాద క్రీడలు కావు. కనుక ఫుట్‌బాల్‌లా ఖ్యాతిని పొందలేదు. అవి భౌతిక శక్తిలో భాగం కాలేవు. అందువల్ల యీనాటికీ పాశ్చాత్య దేశాల్లో మాత్రమే ఘనతకెక్కిన ఆటని ప్రస్థానత్రయంలో ప్రధానమైన భగవద్గీతకి పోటీగానిలబెట్టాడు. తద్వారా భారతీయ భౌతికతని పాశ్చాత్య భౌతికతతో తిరస్కరిస్తాడు వివేకానంద స్వామి.

నిజమే. భౌతికత చాలా ప్రధానమైనది. యీ విషయాలలో మనం వివేకానందతో ఏకీభవించవచ్చు. కాని పాశ్చాత్యులకంటే భారతీయులు యెక్కువ మెటీరియలిస్టులు. నిజానికి పాశ్చాత్యులు తాత్విక అర్థంలో మెటీరియలిస్టులు కానేకారు. దానికి భిన్నంగా భారతీయుల కాస్మాలజీ భౌతిక వాదాన్నే బలపరుస్తుంది. భారతీయ తాత్విక శాఖలు అన్నీ సృష్టి అనాది–అనంతం అని ప్రకటించాయి. దీని ప్రకారం క్రైస్తవంలోలా సృష్టికర్త వునికి అసాధ్యం. అంటే సృష్టికర్తయైన దేవుడు అనే భావన భారత ఖండంలో లేనే లేదు. సృష్టి గురించి భారతీయ దృక్పథం క్రైస్తవ పాశ్చాత్యం కంటె పూర్తిగా భిన్నమైనది.

క్రైస్తవం ప్రకారం సృష్టికర్త శూన్యంలోనుంచి యీ పాదార్థిక జగత్తుని సృష్టించాడు. భారతీయ సనాతన దృక్పథం దీనికి పూర్తి విరుద్ధమైనది. నా సతో విద్యతే భావః నాభావో విద్యతే సతః (భగవద్గీత) అసత్తు (ఉనికిలేని శూన్యం) నుంచి యేది పుట్టదు. అలాగే వునికిలో వున్నది పూర్తిగా శూన్యంగా కరిగిపోదు.

అందువల్ల భగవంతుడు కూడా శూన్యంలోనుంచి దేన్నీ సృష్టించలేడు. సృష్టి చేయడానికి నిమిత్తకారణం, ఉపాదానకారణం రెండూ వుండాలి. కుమ్మరి వుండాలి. పదార్థం (మట్టి) వుండాలి. అప్పుడే సృష్టి సాధ్యం. యీ రెండుగానూ భగవంతుడు వ్యవహరించగలడని ఉపనిషత్తు స్పష్టం చేస్తోంది. అదెలా సాధ్యం? సాలెపురుగు తన శరీరంలోనుంచి వచ్చిన దారాలతోనే సాలెగూడుని అల్లుతోంది. అలాగే సృష్టికర్త, సృష్టికూడా భగవంతుడే. యిది పూర్తిగా పాశ్చాత్య థియాలజీకి విరుద్ధం. భారతఖండంలో దేవుడు సృష్టిలో, పదార్థంలో కరిగిపోతాడు.

నిజానికి భారతదేశం పాశ్చాత్యానికి భౌతికవాదాన్ని నేర్పవలసివుంది. నోమ్‌చామ్‌స్కీ అంటాడు – ప్రపంచంలోకెల్లా ఫండమెంటలిస్టు దేశం అమెరికా అని. ఎందుకంటే

అక్కడ యిప్పటికీ చాలామంది సృష్టి కొన్ని వేల సంవత్సరాల క్రితం జరిగింది అని నమ్ముతారు. భారతీయ దృక్పథం ప్రకారం సృష్టి అనాది. కొంతమంది సైంటిస్టులు బిగ్‌బ్యాంగ్ థియరీ క్రైస్తవ మత ఛాందసత్వం నుంచి ఆవిర్భవించిందంటున్నారు. ఈ దృక్పథాన్ని కొందరు పాశ్చాత్య కమ్యూనిస్టులు సమర్థిస్తున్నారు. నిజానికి అనంతం అనే భారతీయ దృక్పథం భౌతిక జగత్తుని విశాల దృక్పథంతో అర్థం చేసుకోవడానికి పనికి వస్తుంది. ('రీజన్ ఇన్ రివోల్ట్' గ్రంథం చూడండి)

కాని 'అనంతం' అనే ప్రాచీన భారతీయ దృక్పథాన్ని హిందూత్వ తిరస్కరిస్తుంది. ఎందుకంటే హిందూత్వ, పాశ్చాత్య వలసవాద శిశువు. లౌకీకరించబడిన క్రైస్తవం నుంచి హిందూత్వ పుట్టింది. అందువల్ల క్రైస్తవ మతంతోనూ, అదే సందర్భంలో పాశ్చాత్య క్రైస్తవ రాజకీయాలతోనూ హిందూత్వకి అవినాభావ సంబంధం వుంటుంది. క్రైస్తవ కాస్మాలజీయే, క్రైస్తవ ప్రాపంచిక దృక్పథమే హిందూ ప్రాపంచిక దృక్పథం కూడా. అందుకే ధనుర్ధారియైన రాముడు అనే ఒకే ఒక మిలిటెంట్ దేవుడు అవసరమయ్యాడు హిందూత్వకి. క్రైస్తవంలో కూడా దేవుడు శపిస్తాడు. తనని ధిక్కరించిన వారిని, నిర్లక్ష్యం చేసిన వారిని ముప్పు తిప్పలు పెడ్తాడు. కాని దైవ కుమారుడు వచ్చి దైవ సందేశాన్ని సువార్తని చెప్పి వెళ్తాడు. ఆ సువార్త యేమిటంటే – దేవుణ్ణి నమ్ము, లేకపోతే నీకు అధోగతే. దైవకుమారుడు ఆయుధం ధరించడు కాని అతని మాట ఆయుధం కన్న పదునైనది. నమ్ము, అంగీకరించు, వొకే దేవుణ్ణి, వొకే మతాన్నీ అనుసరించు లేకపోతే నశిస్తావు అనేదే ఆ సువార్త. అందుకే నిన్ను వలె నీ పొరుగువారిని ప్రేమించుము అనే పేరుతో జరిగిన హింస మరి దేని వల్లా జరగలేదు. ఐతే యీ హింస నాగరికమైనది. బర్బరీకమైన అనాగరికమైన అరాచకమైన పేగన్, హెథెన్ విశ్వాసాలని నిర్మూలించి, వొకేవొక విశ్వజనీన సత్యాన్ని స్థాపించడమే యీ సువార్త లక్ష్యం. యిది కేవలం వైయుక్తిక మిస్టికల్ అనుభూతి కాదు. భూమిమీద స్థిరంగా వేళ్లూనుకోవడం, వస్త్వీకరణ క్రైస్తవంలో ప్రధానమైనది. చివరికి జడ్జిమెంటు భూమిమీదే జరుగుతుంది. దైవపరిపాలన భూమి మీద స్థాపించబడ్తుంది అంటే యిది వూహాపోహల మీద ఆధారపడలేదు. వొక క్రమబద్ధమైన స్థలకాలాల్లో సంభవించే వాస్తవం యిది. యీ దృక్పథం నుంచే చరిత్ర అనే భావన స్థిరీకరించబడింది. అందువల్ల క్రీస్తు స్థలకాలాలు చాలా స్పష్టమైనవి, వస్త్వీకరించబడినవి (ఆబ్జక్టిఫైడ్). యీ చారిత్రక భావన నుంచే ఆధునిక హిందూ రాముడు వుట్టాడు.

నిజానికి రాముడు కాని మరే పురాణ యితిహాస పాత్రలు కాని స్థలకాలాలలో వస్తీకరించబడలేదు, వాస్తవ సంఘటనలుగా కుదించబడలేదు. అవి విభిన్న కథనాలు. అనంతంలో స్థల కాలాలూ, సంఘటనలూ, పాత్రలూ ఏకరూపంగా స్థిరపడవు. వాటి ప్రయోజనం చారిత్రీకరణ కాదు. పురాణ ఇతిహాస కథలు వారివారి అర్హతని బట్టి బుద్ధి శక్తిని బట్టి, ఆధ్యాత్మిక దృక్పథాన్నిబట్టి తిరిగి తిరిగి నిర్వచించబడ్తూ వచ్చాయి. ఆ కథలు ఏవిధంగానూ వొకే రీతిలో వొకే గ్రంథంలో స్థిరీకరించబడలేదు. వేదాంత దృష్టిలో నామరూపాలు జగత్తుపై ఆరోపించబడినవి మాత్రమే. అందువల్లనే కావచ్చు. వొకొక్కసారి రామనామం రామకథనుంచి వేరు పరచబడింది కూడా. కబీర్ రాముడు రహీమూ వొక్కరే అని చాటినపుడు, దశరథ అయోధ్యరాముడుగా కాదు వొక పవిత్ర నామంగా రాముడు ముందుకు వచ్చాడు. రామ నామాన్ని స్మరించడం, లిఖించడం పుణ్యంగా భావించబడ్డాయి. యిక్కడ రాముడు కథతో, రూపంతో సంబంధం లేకుండా పేరుగా విరాజిల్లాడు.

అలాగే ఆధ్యాత్మ రామాయణం రామ కథని అద్వైత మాయావాదంగా మలిచింది. సంఘటనల ప్రాధాన్యాన్ని మరుగు పరిచింది. అసలు సీతని రావణుడు అపహరించడమే అబద్ధం అంది. రావణుడు అపహరించిన సీత మాయసీత అని కల్పిత సీత అని అంది.

హిందూత్వవాది గోల్వాల్కర్ 'బంచ్ ఆఫ్ థాట్స్' గ్రంథంలో ఆధ్యాత్మ రామాయణం ప్రసక్తి వుంది. వొక పెద్దమనిషి యీ గ్రంథాన్ని రోజూ పారాయణం చేస్తాడు. యీ గ్రంథం ద్వారా ఆధ్యాత్మిక స్థితిని, మోక్షాన్ని పొందవచ్చునని విశ్వసిస్తాడు. యీ దృక్పథాన్ని గోల్వాల్కర్ నిష్క్రియా పరత్వంగా ఖండిస్తాడు. రాముణ్ణి గొప్ప మానవత్వం (మేన్ హుడ్) సాధించిన వ్యక్తిగా అనుసరించాలని అంటాడు.

యిది దృక్పథంలో మార్పు. మానవత్వం అనే పదమే పూర్తిగా ఆధునికమైనది, పాశ్చాత్యమైనది. జంతూనాం నరజన్మ దుర్లభం వంటి వాక్యాలు కనిపిస్తాయి. మనిషి జంతువులలో భాగమే. ఉత్కృష్టమైన జంతువు అంతే. అందుకే శివుడికి పశుపతి అని పేరు. మనిషితో సహా అన్ని జీవులు పశువులే. జన్మజన్మాంతరాలలో మనిషి మళ్లీ పశువుగానో, కీటకంగా, వృక్షంగానో జన్మించవచ్చు. మనిషి స్థితి శాశ్వత స్థితి కాదు; క్రైస్తవంలోలా. అందుకే మనకి మేన్ హుడ్ అనేది లేదు. మానవ కేంద్రక దృష్టి అసాధ్యం. యీ మానవ కేంద్రకదృష్టి పాశ్చాత్యం నుంచి దిగివచ్చింది. అందుకే రాముణ్ణి మానవోత్తముడిగా నిలపడానికి ప్రయత్నించారు గోల్వాల్కర్ లాంటి హిందూత్వ వాదులు.

నిజానికి రాముడు పురుషోత్తముడు. పురుషశబ్దానికి కాస్మిక్ అర్థం వుంది. ప్రకృతి – పురుషుల సంయోగం వల్ల సృష్టి సంభవిస్తుందని సాంఖ్యం చెప్పింది. యిక్కడ పురుషుడు అంటే జీవుడు, ఆత్మ అని అర్థం. పరిణామాన్ని నిర్లిప్తంగా గమనిస్తూ, కేవలం చైతన్య మాత్రుడిగా భాసిల్లేవాడే పురుషుడు. ప్రకృతి జడ జగత్తుకి, పురుషుడు చైతన్యానికి సంకేతాలు. స్త్రీ పురుష లైంగికతని విశ్వంలో చూశారు భారతీయ తాత్వికులు. అందువల్ల మానవతా వాదం లాంటిది మనకి లేదు. కాని క్రైస్తవ ప్రభావం నుంచి దాన్ని బలపరచాలని చూశారు హిందూత్వ వాదులు.

అందువల్ల క్రీస్తులాంటి మానవోత్తముడి కోసం వెతికారు. సీత జంటగా లేని రాముడి బొమ్మలని ప్రచారంలోకి తెచ్చారు. నిజానికి భారతీయదేవుళ్లు జంటలుగానే దర్శనమిస్తారు. మేన్ అనే పదానికి మనిషి అనే సాధారణ అర్థమే కాదు, పుంలింగం అనే అర్థం కూడా వుంది. కాని నర, మానవాది పదాలు స్త్రీ పురుషులని యిద్దరినీ సూచిస్తాయి. మేన్ అండ్ వుమెన్ అన్నట్లు నరుడు – నరురాలు అనే పదాలు లేవు. అర్థనారీశ్వర తత్వం దానికి కారణం. సృష్టి మూలంలోనే రెండు జెండర్లూ కలగలిసిపోయి వున్నాయి. అందుకే గాయత్రి అంటే సూర్యుడు (సవిత). అదే సమయంలో ఆడ దేవత కూడా. రెండు జండర్లని అతిక్రమించిన పరమాత్మ అనే అర్థం కూడా చెప్పవచ్చు.

యిలాంటి బహుళ అర్థాలని కుదించివెయ్యడానికి వలసవాద యింగ్లీషు భాష కూడా కారణమైంది. హిందూ వాదులందరూ యింగ్లీషు భాషనే హిందూత్వ భాషగా తీర్చిదిద్దారు.

అందువల్ల వలస ఆధునికత స్పష్టమైన జండర్ విభజనని తెచ్చి, పుంలింగాన్ని అంటే దురాక్రమణ తత్వాన్ని, యుద్ధ ప్రియత్వాన్ని ఆదర్శంగా నిలిపింది. యిప్పుడు రాముడు సీతారాముడి స్థాయి నుంచి, పరమాత్మ తత్వం నుంచి మేన్లీనెస్ పుంలింగ దౌర్జన్యానికి ప్రతీకగా మలచబడ్డాడు. ధనుస్సుని యెక్కుపెట్టిన యుద్ధ వీరుడిగా మలచబడ్డాడు. ప్రాచీన దేవాలయాల్లో యిటువంటి విగ్రహాలు కనబడవు. కులం ప్రసక్తి అనవసరం, అందరం వొకే హిందూ సమూహంగా ఏకం కావాలి అని పిలుపునిచ్చాడు గోల్వాల్కర్. సావర్కార్ కులనిర్మూలనని గురించి కూడా మాట్లాడాడు. వివిధ జాతులుగా వున్న భారతీయుల్ని వొకే జాతిగా హిందువులుగా మలచాలి. మరి యుద్ధం ఎవరిపైన? అంటే ముస్లింలపైన. హిందీకి ప్రాధాన్యం, ఉర్దూని ముస్లింల భాషగా తిరస్కరించడం యివన్నీ వొక హిందూ భాష కోసం ప్రయత్నాలు. కాని నిజానికి హిందూత్వ భాష ఆంగ్లమే. ఆంగ్ల మానసపుత్రులైన చిత్పవన్ బ్రాహ్మణుల నుంచి, పీష్వాల నుంచి హిందూత్వ పుట్టింది.

నిజానికి చిత్పవన్ బ్రాహ్మణులు సాంప్రదాయ బ్రాహ్మణులు కాదు. పైగా సాంప్రదాయ మఠమైన శృంగేరీ శంకరమఠంపై పరశురామ బావూ అనే పీష్వా దాడిచేసి లూటీ

చేశాడు, పూజారుల్ని బ్రాహ్మణులనీ హింసించాడు. అప్పుడు టిప్పుసుల్తాన్ శృంగేరీ మఠానికి రక్షణ కల్పించాడు. చాలా సంపద యిచ్చాడు.

అందువల్లే శృంగేరీ పీఠాధిపతులు ముస్లింద్వేషం కలిగినవారు కాదు, పైగా కృతజ్ఞతతో ముస్లిం ప్రభువులని తలచుకొనేవారు. 34వ శృంగేరీ పీఠాధిపతి శ్రీ చంద్రశేఖర భారతీస్వామి బ్రిటీష్ పరిపాలన కాలానికి చెందిన వారు. ఆయన టిప్పుసుల్తాన్ మతోన్మాది అనే ప్రచారాన్ని ఖండించారు. అది బ్రిటీషు వాళ్ల పుక్కిటి చరిత్ర, వలస క్రైస్తవులు తమని మంచి పరిపాలకులుగా చాటుకొనడంలో భాగంగా కల్పించిన కట్టు కథ అని తేల్చేశారు.

ముస్లిం ద్వేషం మరాఠీ చిత్పవన్ బ్రాహ్మణుల నుంచి వచ్చింది. నిజానికి పీష్వాలు తమ అధికారాన్ని నిలుపుకోవడం కోసం మొదట బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా యుద్ధం చేశారు. ఓడిపోయారు. నిజానికి పీష్వాల సైన్యంలో ముస్లింలు కూడా వున్నారు.

యీ చిత్పవన్ (పీష్వా) బ్రాహ్మణులకి స్వప్రయోజనాల మీదతప్ప దేని మీదా ఆసక్తి లేదు. వారికి సాంప్రదాయం సంస్కృతుల మీదకూడా గౌరవం లేదు. అందుకే శృంగేరీ మఠం కూడా లూఠీ చేశారు, బ్రాహ్మణులను హింసించారు.

హిందూత్వ ప్రవక్త సావర్కర్ ఫక్తు నాస్తికుడు. సాంప్రదాయాన్ని సంపూర్ణంగా తిరస్కరించాడు. భార్య చనిపోయినపుడు కర్మ జరపలేదు. తాను చనిపోయినపుడు కర్మ జరపవద్దని వీలునామా రాశాడు. ఆంబులెన్సులో తీసుకువెళ్లి, ఎలక్ట్రిక్ యంత్రం ద్వారా దహనం చెయ్యమన్నాడు. దైవాన్ని తిరస్కరించడం కన్న, పితృకర్మని నిరాకరించడం సనాతన ధర్మం ప్రకారం తీవ్ర అపచారం. బ్రాహ్మణుల ఛాందసత్వం వల్లే ముస్లిం మతాంతరీకరణలు జరిగాయని ఒక నాటకంలో రాశాడు. ముస్లింలని ప్రత్యక్ష శత్రువులుగా భావించాడు. హిందూ ఐక్యతకోసం కలగన్నాడు. కుల నిర్మూలనను గురించి మాట్లాడాడు. అంతే కాదు అంబేద్కర్ నిర్వహించిన మహద్ పోరాటానికి కూడా మద్దతు పలికాడు అని ధనంజయ్‌కీర్ రాశారు. (ధనుంజయ్‌కీర్ సావర్కర్, జ్యోతిబా పూలేల జీవిత చరిత్రలు రచించారు).

అసమానతలతోనైనా, హైరార్కీలతోనైనా, హిందూనేషనాలిటీని నిర్మించడం సావర్కార్ లక్ష్యం. గోల్వాల్కర్ లక్ష్యం కూడా అదే. జర్మనీ ఫాసిస్టు జాతీయత కూడా అలా నిర్మించబడిందే. ఎక్కడ నేషనాలిటీ ఏర్పడినా అంతర్గత అసమానతలు కొనసాగుతూనే వచ్చాయి కదా?

సనాతన సాంప్రదాయంలో సంస్కృతిలో బహుళత్వానికి ఆస్కారం వుంది. కొన్ని పరిమితులతోనైనా శాంతియుత సహజీవనానికి ఆస్కారం వుంది కాని అటువంటి అవకాశాన్ని ఆధునిక హిందూ జాతీయవాదం నాశనం చేస్తూ వచ్చింది.

మరింత సమీపగతానికి వచ్చినట్లైతే యీ సాంప్రదాయ విధ్వంసం మరీ నగ్నంగా కనబడ్తుంది. అద్వానీ రథయాత్రని రామ జన్మ భూమి ప్రధాన పూజారి లాల్ దాసు వ్యతిరేకించారు. బాబ్రీ మసీదుని ధ్వంసం చెయ్యరాదు అని పట్టుబట్టాడు. అప్పుడు కళ్యాణ్ సింగ్ యూపీ ముఖ్యమంత్రి, ఆయన బహుజనుడు కూడా. లాల్ దాస్‌ని పూజారి పదవి నుంచి తొలగించారు. లాల్ దాసుని హిందూత్వ వాదులు చంపేశారు.

నిజానికి లాల్ దాసు రామరాజ్యం కావాలని కోరుకునే వారు. వర్షాకాలంలో భూమి గడ్డితో కప్పబడిపోయినట్లు, సత్యం మరగున పడిపోయింది. కాని రుతు పరివర్తన జరిగినపుడు సత్యం సాక్షాత్కరిస్తుంది అనే రామాయణ వాక్యాన్ని ఆయన వుటంకించేవారు. ఆయన వ్యక్తం చేసిన రామరాజ్యం అనే భావన, హిందూత్వకి పూర్తి విరుద్ధం. కబీర్‌లాంటి సంత్‌ల ఆలోచనలకి ఆయన ప్రతినిధి, మత సామరస్య వాది.

నిజానికి రామకథ వొకే విధంగా లేదు, అది బహుముఖం. అందువల్లే రామ్ మనోహర్ లోహియా రామలీల, రావణలీల ఉత్సవాలకి రెండింటికీ అనుమతి యివ్వాలని అన్నారు. ఎందుకంటే వొకే రామాయణంలేదు – బహు వ్యాఖ్యానాలు, బహుళ కథనాలూ ఉన్నట్టే. వాల్మీకి సంస్కృత రామాయణాన్ని మాత్రమే ప్రామాణికంగా చాటడం, గ్రంథాన్ని ప్రధానం చెయ్యడం ప్రచ్ఛన్న క్రైస్తవం మాత్రమే.

అందుకే ఎ కె రామానుజన్ వేలాది రామాయణాల గురించి పుస్తకం రాశారు. దాన్ని సిలబస్సు నుంచి తీసివెయ్యాలని హిందూత్వవాదులు గోల చేశారు.

అంటే భారతీయ యితిహాస, పురాణాలు గ్రంథాలలో మూల్గవు, లైబ్రరీలలో చెదలు పట్టవు. అవి మౌఖికంగా ప్రచారంలో వుంటాయి. అందుకే వాటికి వొకే వొక ప్రామాణికరూపం వుండదు. కథలు, ఉపకథలు, ఉపాఖ్యానాలతో విస్తరిస్తూ వచ్చాయి. ఇరవై వేల శ్లోకాలు వున్న మహా భారతం లక్ష శ్లోకాలకి అలాగే విస్తరించింది. ఇతిహాస పురాణాలు కూడా యిలాగే వృద్ధి చెందాయి.

వలస మేధావులు ప్రక్షిప్తాలని తొలగించి మూల గ్రంథాలని వుద్ధరించడానికి ప్రయత్నించారు కాని యిది సంప్రదాయ విరుద్ధ ప్రయత్నం. కథా కథనాలు ప్రవాహశీలమైనవి.

నో మోర్ రామాయణాస్ అంటూ సంప్రదాయ మౌఖిక సంస్కృతికీ, తద్వారా బహుళ సంస్కృతికీ గండి కొట్టారు హిందూత్వవాదులు.

నిజానికి హిందుత్వవాదులనుంచి యెటువంటి నూతన కథనాలకి ఆస్కారం లేదు. బాబ్రీ మసీదును కూల్చగలరేకాని నూతన రామాయణాన్ని వారు కూర్చలేరు.

వేదం దగ్గరినుంచి, భారతం వరకు అన్నీ సంహితలుగానే ప్రసిద్ధి చెందాయి. అవి కూర్పులు కనుక గ్రంథకర్త పేరు చారిత్రకమైనది కాదు. వ్యాసుడు అంటే వేద విభజన చేసిన రుషి అని అర్థం. అంతేకాని అది కేవలం పేరు కాదు. వాల్మీకి అనేది కూడా అంతే. కాళిదాసు అనే పేరు కాళి భక్తుడు అనే అర్థంలో వచ్చింది. ఎవరి వ్యక్తిగత వివరాలూ గ్రంథాలలో లభించవు ఎందుకంటే వొక సంప్రదాయ పరంపరగా వొక తరం నుంచి మరొక తరానికి సంక్రమించాయి. మౌఖిక సంస్కృతి ద్వారా ప్రవహిస్తూ వచ్చాయి. అందువల్ల మార్పులూ చేర్పులూ ఎన్నో.

హిందూత్వ వాదులు అందరూ ఆంగ్ల విద్యావంతులు. అంటే లేఖన సంప్రదాయానికి చెందినవారు. వారికి భారతీయ సంప్రదాయ సంస్కృతితో సంబంధం పూర్తిగా తెగిపోయింది. అందుకే వారు మొదటి నుంచి యితిహాస పురాణాల కంటే చరిత్ర రచనకి ప్రాధాన్యత నిచ్చారు. రాముణ్ణి కూడా ఆంగ్లేయుల చరిత్ర రచనలో భాగంగా కనుగొన్నారు. జేమ్స్‌మిల్ అనే చరిత్రకారుడు భారత చరిత్రని హిందూ, ముస్లిం, బ్రిటీషు యుగాలుగా విభజించాడు. హిందూ యుగానికి తిరోగమించడమే హిందూత్వ వాదుల లక్ష్యం.

ఇతిహాస, పురాణ కథనాలు యిటువంటి తిరోగమనానికి ఆస్కారం యివ్వవు. అవి మనుషుల్నేకాదు, భిన్న సాంప్రదాయాలని, దేవతలనీ కూడా దగ్గరికి జేరుస్తాయి. వెంకటేశ్వర స్వామి బీబీ నాంచారి అనే ముస్లిం స్త్రీని వివాహం చేసుకొన్న కథ యిటువంటిదే.

చరిత్ర రచనలో యిటువంటి సామరస్యతకి ఆస్కారం కల్పించే కథలకి ఏమాత్రం అవకాశం లేదు. వలస ఆధునికత స్పష్టమైన బైనరీ ఆపోజిట్స్‌ని సృష్టించింది. రాక్షసులు–దేవతలు, ఆర్యులు–ద్రావిడులు, హిందువులు–ముస్లింలు యీ ద్వంద్వాలు పూర్తిగా శత్రువైఖరిని సూచిస్తాయి. ఇవి యెక్కడ కలవవు. ఎందుకంటే స్పష్టమైన దృష్టిగోచరమైన స్థల కాల బద్ధములైన వాస్తవాలని గతంలో కనుగొంటుంది చరిత్ర. నిజానికి అటువంటి వాస్తవాలని లేక వాస్తవాలని పోలిన వాటిని చరిత్ర రచన కల్పిస్తుంది.

బైరప్ప అనే కన్నడ రచయిత యీ చారిత్రకదృష్టి వల్లనే హిందూ వాదులకి దగ్గరయ్యాడు. ఈయన 'పర్వ' పేరుతో భారతాన్ని డీమిస్టిఫై చేశారు. భారత ఇతి హాసాన్ని హేతువాద పద్ధతితో చరిత్రగా మార్చాడు. కాల్పనికతని తొలగించి వేశాడు. హిందూత్వవాదులు రామాయణాన్ని రామున్ని డీమిస్టిఫై చేసినట్లే యీయన భారతాన్ని ఫక్తు వాచ్యతలోకి దిగజార్చాడు.

వీళ్లకన్న మేజిక్ రియలిజం పేరుతో పాశ్చాత్యులే పురాణ యితిహాస శైలికి దగ్గరయ్యారు. కాని హిందూత్వ వాదులు పేరుకే భారతీయులు.ఆకారంలో మాత్రమే భారతీయులుగా వుండాలనే మెకాలే ఆలోచనని సాకారం చేశారు వీళ్లు.

నిజానికి పురాణ యితిహాసాలలో అర్థం వైవిధ్యపూరితం. బహుళ దృష్టి కోణాలతో వాటిని అర్థం చేసుకోవాలి. ఆ వైవిధ్యాన్ని హిందూత్వ దృక్పథం, భాష చంపేశాయి.

వేదవ్యాఖ్యాత సాయణుడు సనాతన సారస్వతాన్ని మూడు రకాలుగా వ్యాఖ్యానించ వచ్చునన్నాడు. 1) అధిభౌతికం, 2) అధిదైవికం, 3) ఆధ్యాత్మికం. అంటే పైకి కనబడే భౌతిక వాస్తవికతతో కథనాలుగా పురాణ ఇతిహాసాలని మొదటి చూపులో వ్యాఖ్యానించవచ్చును. మరింత లోతుకి దిగినపుడు వాటిని దేవతలకి సంబంధించిన కథనాలుగా వ్యాఖ్యానించవచ్చు. అత్యంత ప్రధానమైనది, లోతైనది, విస్తృతి కలిగినది ఆధ్యాత్మిక దృష్టి. ఈ విశ్వాన్ని అంతటికీ అంతస్సూత్రంగా వుండే పరమ చైతన్య దృష్టి నుంచి యీ కథనాలని చూడడం.

ముఖ్యంగా ఆధ్యాత్మిక కోణాన్ని హిందూవాదులు భ్రష్టు పట్టించారు. దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఏకాత్మతావాదం అనే కొత్త వాదాన్ని సృష్టించాడు. ఇది హిందూత్వ వాదులకి శిరోధార్యంగా భావించబడ్తోంది. సమాజమంతా వొకే దృక్పథం (భావం) కలిగివుండడం అనే అర్థంలోకి యిది కుదించబడింది. యిది అద్వైత వేదాంతాన్ని దిగజార్చడం. దీని సారాంశమేమిటంటే మేము అందరం హిందువులమే అనే హిందూత్వ జాతీయ భావాన్ని కలిగి వుండడం అని అర్థం.

ఆత్మ పరమాత్మ భావనలని, ఏకం అనే అద్వైత పదాన్ని పరమ వాచ్య స్థితికి దిగజార్చారు. నిజానికి ఆధునిక యుగమంతా అద్వైతం పేరులో హిందూత్వ యూనిఫార్మిటిని, వొకే మతం, జాతి అనే భావనల్ని నెత్తి మీద రుద్దడానికి చేసిన ప్రయత్నమే కనబడ్తుంది. ఈ విధంగా ఆధునిక కాలంలో అద్వైత వేదాంతం ఎక్కువగా దుర్వినియోగం చేయబడింది.

నిజానికి అద్వైతం అనేది లో వెలుగు, అంతర్దృష్టి. అది అనేకమైన వాటి కూర్పు కాదు, బహుళత్వం వెనక వున్న అంతస్సూత్రం. కాని యీ ఆధునిక హిందూవాదన అద్వైతాన్ని ఫాసిస్టు ఐక్యతగా దిగజార్చింది. సామాజీకరించింది.

అద్వైతం వల్ల వచ్చే యీ ముప్పుని ముందుగా వాసన పట్టడం వల్లే 13వ శతాబ్దంలో మధ్వాచార్యులు ఫక్తు ద్వైత్వాన్ని స్థాపించినట్లు కనబడ్తుంది.

ముఖ్యంగా అద్వైత ప్రతీకలని ఛేదించాడు మధ్వాచార్యులు. సర్వం ద్వైతం అన్నాడు. ఏకత్వాన్ని సర్వాత్మనా కాదు అన్నాడు. ఏకత్వాన్ని ఆదర్శంగా చూపే ప్రతీకలు చాలా వున్నాయి. ముఖ్యంగా నదులు సముద్రంలో కలవడం, ఆత్మలు తమ ప్రత్యేక అస్తిత్వాన్ని కోల్పోయి పరమాత్మలో కరిగిపోతాయి అని యీ ప్రతీక బోధిస్తుంది. మధ్వాచార్యులు ఈ ప్రతీకని మరో రకంగా వ్యాఖ్యానిస్తాడు. నదులు తమ అస్తిత్వాన్ని కోల్పోవు సముద్రపు గుణమైన ఉప్పదనాన్ని స్వీకరిస్తాయి అంతే. భార్య, భర్తలు వొకటే అంటే, నిజంగా వొకటి అనికాదు. వొకరి ప్రభావం మరొకరి మీద వుంది. వొకరి గుణాలు మరొకరికి సంక్రమించాయి అని అర్థం. యిద్దరిలో యేవొక్కరూ తమ ప్రత్యేక అస్తిత్వాన్ని కోల్పోరు.

యీ విధంగా అద్వైతం ప్రత్యేక అస్తిత్వాలకి ముప్పుగా పరిణమించిందని మధ్వాచార్యులు నిరూపించాడు. కాని మధ్వ సంప్రదాయానికి చెందిన పెజావర్ స్వామి ఏకాత్మవాదం వంటి భ్రష్ట అద్వైతాన్ని అనుసరించే హిందూవాదుల మెప్పుపొందేలా వ్యవహరించారు. దేశంలోని అందరు సాధువుల్నీ అన్ని సిద్ధాంతాలకి సంబంధించిన సాధువుల్నీ వొకే వేదిక మీదికి తెచ్చి హిందూ ఐక్యత తీసుకురావడానికి ప్రయత్నించడం ద్వైత సిద్ధాంతానికే విరుద్ధం. (నిజానికి మధ్వాచార్యులు అద్వైత సిద్ధాంతానికి పరమ శత్రువు. ఆయన శంకరాచార్యుణ్ణి రాక్షసుడు అన్నాడు). అటువంటి అద్వైత వేదాంతాన్ని సమర్థించే శివానందమూర్తి గారి వంటి వారు కూడా హాజరయ్యారు. హిందూ రాజ్యాంగాన్ని తీసుకురావాలని ప్రతిపాదించారు. (వివేకానంద ఆంగ్ల ఉపన్యాసాల వల్లే అద్వైతానికి ఆధునిక కాలంలో గొప్ప గుర్తింపు వచ్చింది అంటారు మధ్వ పండితుడు బి.ఎన్.కె. శర్మ.)

సముద్రంలో నదులన్నీ కలిసిపోవడం వంటి ప్రతీకల్లోని ఫాసిస్టు స్వభావాన్ని తన ద్వైత ఖడ్గంతో చండాడిన మధ్వాచార్యుని వారసుడే, ఆ సముద్ర ప్రతీకతో అందరినెత్తిమీద హిందూ ఐక్యతని రుద్దే హిందూవాదుల పంధాలో నడవడం విషాదం. ఐతే యీ పెజావర్ స్వామి ముస్లిం మతపెద్దలని ఆశ్రమానికి పిలిచి గౌరవించడం హిందూవాదులకి గుబులు పుట్టించింది.

నిజానికి మధ్వాచార్యుడు భక్తి ఉద్యమం నుంచి వచ్చాడు. భారత ఖండంలోని భక్తి ఉద్యమాలు ఇస్లాం, క్రైస్తవాల నుంచి స్ఫూర్తిని పొందాయి. దానివల్ల భక్తిలో వొక ఎమోషనల్ కంటెంటు వచ్చిచేరింది. పర్సనల్ గాడ్ భావన వచ్చి చేరింది. యిది సామాజికమైన రుగ్మతల్ని అసమానతల్నీ ప్రశ్నించడానికి కూడా పనికి వచ్చింది. యీ వైఖరి మధ్వాచార్యుని తత్వంలో ప్రతిఫలించింది.

నిజానికి వైదిక కర్మకాండలో దేవతల గురించి ప్రార్థనలు వున్నాయి. కాని యీ భావోద్వేగ పరత్వం కనబడదు. అద్వైతంలో జీవునికీ దేవునికీ మధ్య నిరంతరం సంభాషణ అసాధ్యమౌతుంది. మొత్తంగా అద్వైతం అంటే జీవుడు దేవుడుల మధ్య అభేదం డామినేట్ చేస్తుంది.

క్రైస్తవం కంటే ఇస్లాం దైవం జీవుడు మధ్య భేదాన్ని, తీవ్ర ద్వైతాన్ని బోధించింది. ఇస్లాం ద్వైత వేదాంతానికి ప్రేరణగా నిలిచి వుండవచ్చును.

హిందూవాదులు అద్వైతాన్ని భౌతికమైన, సామాజికమైన ఫాసిస్టు జాతీయ ఐక్యతగా కుదించారు. గ్రామం కోసం వ్యక్తి, రాష్ట్రం కోసం గ్రామం, దేశం కోసం రాష్ట్రాలు త్యాగానికి సిద్ధపడాలి. వొక బలమైన కేంద్రంలో అందరూ లీనం కావాలి. దేశభక్తిని మహాపాపంగా పరిగణించిన తెలుగు రచయిత చలం అద్వైతం, సైన్సు రెండూ జీవితాన్ని నిస్సారంగా మార్చేశాయి అన్నాడు.

యీ పోలిక సరైనదే. అద్వైతం, సైన్సు రెండూ అఖండసత్యం కోసం వెతుకుతాయి. సైన్సు భౌతిక జగత్తులోని పదార్థాలనీ సంఘటనలనీ వాటి బహుళత్వాన్ని పక్కనబెట్టి సాధారణీకరణలలోకి యిమడ్చాలని చూస్తుంది. యింకా ముందుకు వెళ్ళి విశ్వాని కంతటికీ వొకే వొక యూనిఫైడ్ థియరీకోసం ప్రయత్నిస్తోంది. అలాగే గాడ్ పార్టికల్ (దైవకణం) కోసం వెతుకుతోంది. అద్వైతం బహుళత్వాన్ని అంతటినీ వొకేవొక సత్యంలో లయింపజేస్తుంది. అందువల్ల సైన్సులోనూ అద్వైతంలోనూ ప్రత్యేకతలు అంతరిస్తాయి. యిది మితిమీరిన ఆబ్జక్టివిటీకి దారితీస్తుంది. అందుకే వివేకానంద అద్వైత అనుభవాన్ని సైన్సునీ పోల్చాడు. సైన్సు విస్తరించిన కాలంలోనే యూరప్‌లో ఫాసిజం ఆవిర్భవించింది. వొకేవొక నేషనాలిటీ అనే మోనిస్టిక్ ఆర్డర్‌ని నెత్తిమీద రుద్దింది. వ్యక్తుల స్వతంత్రాన్ని హరించి వస్తీకరణ స్వాతంత్ర్యానికి చరమగీతం పాడింది. ఈ ఏకీకరణలో అడ్డం వచ్చినవాళ్ళని నిర్మూలించింది.

ఫాసిస్టు రాజ్యాలు అంతరించినా ఆధునికత వొకే వొక మూస జీవిత విధానాన్ని

నిర్మించడంలో తలమునకలుగా వుంది. నిజానికి ఆధునికత నియంతృత్వం ద్వారా హింస ద్వారా విస్తరించింది. అది విస్తరించడంలో వైవిధ్యాన్ని నశింపజేస్తూ వచ్చింది. జీవ వైవిధ్యం, పర్యావరణ వైవిధ్యం, జీవన వైవిధ్యం, సాంస్కృతిక వైవిధ్యాలు అన్నింటినీ నశింపజేస్తూ ఆధునికత విస్తరిస్తోంది.

యిలా వైవిధ్యాన్ని నశింపజేస్తూ విస్తరించే నాగరికతలో నగరీకరణతో హిందూ ఫాసిజం విడదీయలేని బంధాన్ని కలిగి వుంది. అందుకే నగరాలే హిందూ ఫాసిస్టులకి నిలయాలు. ఇంగ్లీషు నేర్చిన పట్టణవాసులే దానికి ప్రధాన వనరు. గ్రామాలు ఏ మాత్రమూ కాదు. అందుకే హిందూవాదులకి స్థానిక సంస్కృతులతో సంబంధం శూన్యం. ముక్కోటి దేవతలతో వారికి అనుబంధం లేదు. అందుకే వొకే జాతీయ దేవుడిగా రాముడిని నిలపడంలో వీరు ముందున్నారు.

రాముడితో మొదలైన యీ మూస పద్ధతి ఏకీకరణ మాంసాహారంపై నిషేధం ద్వారా ఆహార వైవిధ్యానికి ముప్పుగా పరిణమించింది. నిజానికి మాంసాహార నిషేధం మన స్థానిక సంస్కృతికి పూర్తి విరుద్ధమైనది. ఛాందస బ్రాహ్మణులు ఎప్పుడు యిటువంటి నిషేధాన్ని ప్రతిపాదించలేదు. కారణం వర్ణాశ్రమ ధర్మం అందరికీ వొకేరకమైన ఆచారాన్ని కాని, ఆహారాన్ని కాని వొప్పుకోదు. మనకి ధర్మ వ్యాధుడు కథ తెలుసున్నదే. కనుక క్షత్రియులు శూద్రులు మాంసాహారులుగానే వుండాలని వర్ణధర్మం నిర్దేశిస్తుంది. కంచి పరమాచార్య కూడా యిదే సత్యాన్ని బోధించారు. బ్రాహ్మణులు కూడా కొన్ని రాష్ట్రాలలో మాంసాహారులుగా వున్నారు. 'న మాంస భక్షణే దోషః'. మాంసం తినడం తప్పుకాదు అని మనుస్మృతి ఘోషిస్తోంది. యిక గొడ్డు మాంస నిషేధం గురించి ప్రసక్తి శంకర పీఠాధిపతుల గ్రంథాలలో కానరాదు. యే సంప్రదాయ బ్రాహ్మణుడూ దీని గురించి మాట్లాడలేదు. అంటే సనాతన బ్రాహ్మణులు యితర జాతుల ఆచార వ్యవహారాల విషయంలో, ఆహారం విషయంలో విధి నిషేధాలు చెయ్యలేదు. బ్రాహ్మణులకి మాత్రమే విధి నిషేధాలు చేశారు. క్రైస్తవ మిషనరీలు జంతుబలులని వ్యతిరేకించారు.

వలస క్రైస్తవులని అనుకరించిన ఆధునిక సంస్కరణ సంస్థ ఆర్య సమాజ్ గోవధనిషేధం వంటి ఆలోచనలకి బీజాలు వేసింది. యీ సంస్థ క్రైస్తవాన్ని అనుకరిస్తూ అన్ని జాతులకి వొకేవొక జీవిత విధానాన్ని నిర్దేశించాలని చూసింది. యీ సంస్థ సభ్యుడైన దళిత సంస్కర్త భాగ్యరెడ్డి వర్మ గోవధ నిషేధం కోసం వుద్యమించారు. నిజాం నవాబుపై ఒత్తిడి తెచ్చి గోవధ నిషేధం చేయించాడు. ఈయన దళితులకి ఆది హిందువులు అని పేరు

పెట్టాడు. వలస ఆధునికత హిందూ వాదానికి బీజం. హిందూ వాదం సనాతన సంప్రదాయంలో భాగం ఏ మాత్రం కాదు. పైగా సంప్రదాయ విరుద్ధం. అందుకే ఆధునికత విస్తరించే కొలదీ గ్లోబలైజేషన్ వ్యాపించే కొలదీ, హిందూత్వ బలపడ్తూ వచ్చింది. ఆధునిక విద్యావంతులే దానికి బలాన్ని చేకూర్చుతున్నారు. ఆధునిక వ్యాపార కేంద్రమైన గుజరాత్ హిందుత్వకి ప్రధాన స్థావరంగా నిలిచింది. అత్యంత వెనుక బడిన బీహార్ లాంటి రాష్ట్రాలలో అంతగా బలపడలేదు. బీహార్‌లో కులతత్వం వుంది కాని హిందూత్వం బలపడలేదు.

యింకా చెప్పాలంటే కులంలాంటి ప్రాచీన అస్తిత్వాలు హిందూత్వకి ఆటంకంగా నిలిచాయి. గుజరాత్‌లో అగ్రవర్ణమైన పటేల్, బీసీలు ఎస్సీలు కూడా హిందూత్వకి వ్యతిరేకంగా మారుతున్నారు. యీ కుల అస్తిత్వాలు హిందూ మూస ఐడెంటిటీని బీటలు వారుస్తున్నాయి. కర్ణాటకలో వీరశైవులు తమ ప్రత్యేక అస్తిత్వాన్ని ప్రకటించుకోవడం కూడా హిందూత్వకి వణుకు పుట్టించింది.

ఒకొక్కసారి దేవతలు కూడా హిందూత్వకి భయం పుట్టిస్తారు. భారతదేశంలోని దేవీ దేవతలు వైవిధ్య భరితమైనవారు. ఒకొక్కసారి వారి అస్తిత్వంలో వివిధ సంప్రదాయాల మతాల సంగమం, సాంకర్యం కనబడవచ్చు. షిరిడీ సాయిబాబాని పూజించరాదని హిందూ వాదులు వివాదం లేవదీశారు. షిరిడీ సాయి బాబా ముస్లిం అని, గొడ్డుమాంసం తినేవాడని అన్నారు. ద్వారకా శంకర పీఠాధిపతి యీ వివాదానికి వెన్నుదన్నుగా వున్నారు. వొకప్పుడు శంకర పీఠాధిపతులు సాధారణ ప్రజల, శూద్ర అతి శూద్రుల పూజావిధానాలు దేవతల జోలికి వెళ్ళే వారు కాదు. ద్వారకా శంకరాచార్య వైఖరి సంప్రదాయ విరుద్ధమైనది, హిందూత్వకి ఆయన మద్దతుదారు. యీ వివాదం ముదిరి కొన్ని దేవాలయాల్లో షిరిడీ సాయిబాబా విగ్రహాలని తొలగించారు.

హిందూత్వ అనుయాయి పరిపూర్ణానంద షిరిడీ సాయిబాబా పూజని సమర్థించారు తన శిష్యగణంతో షిరిడీ యాత్ర చేసి, యీ వివాదానికి ముగింపు పలుకుతాను అన్నారు. కాని ఆయన హిందూత్వ వాదుల వొత్తిడికి లొంగక తప్పలేదు. అసలు తాను షిరిడీ యాత్ర గురించి మాట్లాడనే లేదు అని మాట మార్చారు.

యీ వివాదం వొక విషయాన్ని స్పష్టం చేసింది. ఇస్లాంని ముస్లింలనీ వేరు పరచి, స్వచ్ఛమైన ఆధునిక హిందూత్వని నిర్మించాలని హిందుత్వ వాదుల తపన. కానీ వారు ఎంత ప్రయత్నించినా ఇది వీలుకాదు. షిరిడి సాయి మాత్రమే కాదు, గుంటూరులో

మస్తాన్ దర్గా, నెల్లూరులో రొట్టెల పండుగకు అశేష ప్రజానీకం వెళ్తారు. గుంటూరు మస్తాన్ దర్గా ధర్మకర్తలు కాపుకులస్తులు. నెల్లూరులో రెడ్డి కులస్తులు మస్తాన్‌రెడ్డి, మస్తానమ్మ పేర్లు పెట్టుకుని మొక్కు తీర్చుకునేవారు చాలా మంది ఉన్నారు.

హిందూత్వ తనదైన సంస్కృతిగా ప్రకటించుకొనే ప్రతిదానిలో ముస్లిం ద్వేషం ప్రధానంగా వుంటుంది. రామజన్మభూమి, తాజ్ మహల్ (తేజేశ్వరాలయం) వివాదాలు యిటువంటివే. యీ వివాదాలని లేవనెత్తడంలో చరిత్ర భావన అనేది ప్రధాన పాత్ర వహిస్తుంది. ఇతిహాస పౌరాణిక విశ్వాసాలు యేమాత్రం ప్రాధాన్యత వహించవు. వొక అమెరికన్ సైన్సు చానల్ రామసేతు గురించి చేసిన వ్యాఖ్యలు అత్యంత ప్రామాణికమైనవిగా భావించబడ్తాయి. యీ మొత్తంలో వాస్తవిక చరిత్ర భావన ప్రధానం.

పౌరాణికత దీనికి పూర్తి భిన్నమైనది. పౌరాణికత వూహలద్వారా స్థలకాల పరిమితులని అధిగమిస్తుంది. పౌరాణిక పాత్రలు యీ అవధులని పూర్తిగా వొక్క అంగతో దాటేస్తాయి. స్థలకాల పరిమితులు లేనిదే సనాతనం. చరిత్ర సనాతనం కాదు. అది సనాతనానికి విరుద్ధం. చరిత్రలో స్థలకాలాలని స్పష్టంగా నిర్ధారించడమే ప్రధానం.

సనాతన దృష్టి అంటే యేమిటో స్పష్టం చేయడం కోసం వొక కథ చెప్తాను. రామునికి సంబంధించిన కథ యిది. శ్రీరాముడు అవతారం చాలించే సమయం ఆసన్నమైంది. యముడు రాముని రాజభవంతికి వచ్చేశాడు. కాని హనుమంతుడు పక్కన వుండగా రాముని ప్రాణాలు తీసుకొని వెళ్ళే ధైర్యం యమునికి లేదు. రాముడు తను అవతారం చాలించే సమయం వచ్చిందని గుర్తించాడు. అందుకోసం హనుమంతుణ్ణి దూరంగా పంపదలచుకున్నాడు. తన ఉంగరం రంధ్రంలోకి జారిపడిందని ఆంజనేయుడితో చెప్పాడు. అప్పుడు హనుమ సూక్ష్మరూపం ధరించి, ఆ రంధ్రంలోంచి పాతాళలోకానికి జేరుకొన్నాడు. పాతాళ అధిపతి వాసుకిని కలిశాడు. రాముని అంగుళీయకం గురించి అడిగాడు. కొండలా కనబడే వుంగరాల గుట్టని చూపించాడు వాసుకి. అన్ని వుంగరాలు వొకేలా వున్నాయి. అన్నీ రామ నామాంకితాలే. అప్పుడు వాసుకి చెప్పాడు. వాయుపుత్రా! కాలచక్రం పరిభ్రమిస్తోంది. యుగాలు తిరిగి తిరిగి సంభవిస్తున్నాయి. దానివల్ల రాముడు అనేకసార్లు అవతరించాడు. ప్రతి సారీ యిలాగే వుంగరాలు పోగొట్టుకొంటూ వచ్చాడు. కాలానికి ఆది, మధ్య, అంతాలు లేవు. యుగాలూ అనంతాలు, అవతారాలూ అనంతాలు.

సరిగ్గా యీ అనంతం అనే సనాతన భావనని అంతరింపజేసేది చరిత్ర భావన. దానితో స్థల కాలాలు కుదించుకుపోయాయి. వస్తీకరించబడ్డాయి, డిమిస్టిఫై చేయబడ్డాయి.

పురాణాలు అభూత కల్పనలుగా తృణీకరించబడ్డాయి. ప్రపంచమే వొక కల్పన అని, యింద్రజాలమని, స్వప్న తుల్యమని వేదాంతం బోధిస్తుంది. యీ వేదాంత భావన పౌరాణిక కల్పనలకి దోహదం చేసింది.

కాని కల్పనకి గల ప్రాధాన్యం తగ్గిపోయింది. కల్పన సత్యానికి దగ్గరదారి అనే ఆలోచన మృగ్యమైంది. చారిత్రిక ఆధారాలకోసం వెంపర్లాట మొదలైంది. దాని వల్ల తాత్విక దృష్టి తగ్గి పోయింది. ఆధునికత సృష్టించిన శూన్యం నుంచే హిందూత్వ పుట్టింది. దాని వల్లనే హిందూత్వ వాదుల నుంచి కవులు కాని వాగ్గేయకారులు కాని పుట్టలేదు. ఆవేశ పూరిత ప్రసంగాలు చేసే రాజకీయ నాయకులు మాత్రమే పుట్టారు. కట్టడాలని కూల్చగల అల్లరి మూకలు మాత్రమే ఆవిర్భవించాయి.

రామాయణ కల్ప వృక్షం రాసిన విశ్వనాథ సత్యనారాయణ అనే సనాతన కవి దేవాలయాల శైధిల్యానికి ముస్లిం దాడులే కారణం అనే భావనని ఖండించారు. పైగా అశ్రద్ధ నిర్లక్ష్యాలే కొన్ని దేవాలయాల దుస్థితికి కారణం కావచ్చునని రాశారు (మోయుతుమ్మెద). సంప్రదాయాన్ని అనుసరించే సనాతనులలో ఆవేశకావేశాలు తక్కువ, ఊహా శక్తి యెక్కువగా కనబడ్తుంది. కారణం – చరిత్ర అనేదాన్ని వలసవాదులు స్వప్రయోజనం కోసం సృష్టించారు. చరిత్ర రచనలో భాగంగా హిందూ ముస్లింలని శత్రువులుగా మార్చారు. అది ప్రతీకార భావనకి దారి తీసింది. అందుకే బాబ్రీ మసీదు విధ్వంసం జరిగినపుడు వి.ఎస్. నయపాల్ చరిత్ర బేలెన్స్ చేయబడింది అని ప్రకటించాడు.

గతాన్ని మనం ఏ పద్ధతిలో గుర్తుంచుకుంటాం, స్మరణకి తెచ్చుకుంటాం అనేది చాలా ముఖ్యమైన విషయం. చరిత్ర భావన స్మృతిని హేతుబద్ధం చేయడానికి ప్రయత్నించింది. హేతుబద్ధత అనేది ఆహేతువుని ఎవరు సానబెడ్తున్నారనేదాన్ని బట్టి వుంది. వారి పాక్షిక దృష్టి మీద ఆధారపడ్తుంది. వలసవాదులు స్మృతి (మెమొరీ)ని చరిత్ర పేరుతో హేతుబద్ధం చేయడానికి ప్రయత్నించినపుడు, వలసవాద హేతుబద్ధ దృష్టి అభివృద్ధి చెందింది. వలసవాద దృష్టితో గతాన్ని మదింపు చెయ్యడమే చరిత్రగా ఆవిర్భవించింది.

బాలగంగాధర తిలక్ వంటి జాతీయవాదులు వలసవాదుల తోక పట్టుకుని నడిచారు.బ్రిటీష్ వారు మొదటిసారిగా భరతఖండమంతా జనాభా లెక్కలు తీశారు. ప్రధానంగా హిందూ–ముస్లిం పేర్లతో జనాభాని లెక్కపెట్టారు. దీంతో భారతీయ ఆలోచనలోకి స్పష్టమైన లెక్కింపు ప్రవేశించింది. యీ గణన అనేది భారతీయ ఆలోచనని కుదించి వేసింది.

యిది పౌరాణిక సనాతన విశాల దృష్టిపై మబ్బులా కమ్ముకుపోయింది. డెమోగ్రాఫిక్ రాజకీయాలు ప్రారంభమయ్యాయి.

తరువాత కొద్ది సంవత్సరాలకే బాలగంగాధర తిలక్ వినాయక ఉత్సవాలని బహిరంగ ప్రదర్శనలుగా మార్చి, హిందూ సమీకరణ మొదలుపెట్టాడు. నిజానికి వినాయకుడు గృహదైవం. వినాయక పూజని యింటిలోనే జరుపుకుంటారు. అటువంటి వినాయకుణ్ణి హిందూ సమీకరణకి, హిందూ జనాభా గుమిగూడడానికి సాధనంగా మార్చాడు. లెక్కింపుకి అందకుండా బహుళత్వంతో వివిధ సంప్రదాయాలలో వివిధ దేవతలతో విరాజిల్లుతున్న జాతుల్ని వొకే హిందూ నామధేయంలోకి కుదించడానికి ప్రయత్నం ప్రారంభమైంది. యిదే హిందువుల సంఖ్య అనే ఆలోచనకి దారితీసింది. హిందువుల జనాభా తగ్గిపోతోందనే ఆందోళనకి మూలం యిదే.

యీ జనాభా గణనలో హిందువులు ముస్లింలకి బైనరీ అపోజిట్‌గా సృష్టించబడ్డారు. జేమ్స్‌మిల్ అనే చరిత్రకారుడు గతాన్ని అంతా హిందూ–ముస్లిం యుగాలుగా విభజించేశాడు అనుకోండి. యిప్పుడు వర్ణ స్వచ్ఛత గురించి చర్చ ముగిసి, మత స్వచ్ఛత గురించి చర్చమొదలైంది. వర్ణ సాంకర్యం గురించి చర్చోపచర్చలు అంతరించి మత సాంకర్యం కమ్యూనిటీ సాంకర్యాల గురించి వివాదం రగుల్కొంది. అది యీనాడు లవ్ జిహాద్‌గా మారింది. నాజీ జర్మనీలో కూడా యిటువంటి రేషియల్ ప్యూరిటీ గురించే ప్రయత్నం జరిగింది. జర్మన్ స్త్రీలు యూదు పురుషులని వివాహం చేసుకోవడం నేరంగా భావించబడింది. భారతదేశంలో హిందూ రేసిజం ప్రారంభమైందనడానికి యిది స్పష్టమైన తార్కాణం.

శృంగేరీ శంకరపీఠాధిపతి శ్రీ చంద్ర శేఖర భారతీ స్వామి వారి దృష్టిలో ధర్మాన్ని అనుసరించే వారి సంఖ్య అనవసరం. సనాతన ధర్మాన్ని నిజంగా అనుసరించేవాడు వొక్కడు వున్నా చాలు. సంఖ్య పెంపుదల క్వాలిటీని సూచించదు అని ఆయన అభిప్రాయం. విశ్వనాథ తన 'రామాయణ కల్పవృక్షం'ని వొక్కరు చదివినా చాలు అన్నారు.

పారిశ్రామిక నాగరికతతో పాటు మాసివ్ పెద్ద సంఖ్యలో ఉత్పత్తి చేయడం, సంఖ్యని పెంచుతూపోవడం అనే భావనకి విలువ పెరిగింది. మనిషి వస్తూత్పత్తికి సహకరించే సాధనంగా భావించబడ్డాడు. హ్యూమన్ రిసోర్సెస్ – మానవ వనరులు అనే పదం పుట్టింది. దీంతో మనుషులు కూడా లెక్కించి అరలలో సర్దదగిన, కేటగిరైజ్ వర్గీకరణ చేయగలిగినవాళ్లుగా భావించబడ్డారు. యిది 'అనంతం' భారతీయ భావనకి చెంపపెట్టుగా

మారింది. యీ వర్గీకరణనుంచే చరిత్ర పుట్టింది. కాలాన్ని మనుషుల్ని వర్గీకరించి గణించడం మొదలైంది. యిది కేంద్రీకృతమైన హింసకి, తద్వారా అభివృద్ధికి సాధనమైంది. ముస్లిం జనాభా పెరిగిపోతోందని, అది హిందువుల వునికికి ప్రమాదమనే భావన పెరిగింది.

నిజానికి బ్రిటీషు జనాభా గణనకి పూర్వం, వలస చరిత్రీకరణకి పూర్వం యిటువంటి విభజన అసాధ్యం. ముస్లిం – హిందూగా వర్గీకరించలేని, వర్గీకరించబడని సమూహాలు ఎన్నో వుండేవి. వీటిని కూడా అటో యిటో తేల్చెయ్యవలసిన అగత్యం పట్టింది. నేడు ఆధార్ కార్డ్ పేరుతో వ్యక్తుల గణన, వర్గీకరణ సమాచార సేకరణ తీవ్రస్థాయికి చేరింది. యిది సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని మరింత సూక్ష్మతరం చేస్తోంది.

కమ్యూనల్ హింసకి కూడా గణన తోడ్పడ్తోంది. గుజరాత్‌లో ముస్లింల యిళ్ళనీ, షాపుల్నీ స్పష్టంగా గుర్తించి లెక్కించి దాడి చేశారు. ఆధునికత అభివృద్ధి గణాంకాల్నేకాదు, విధ్వంస గణాంకాల్ని కూడా ముందుకు తెచ్చింది. యివి రెండూ పరస్పర పూరకాలు. మానవ చరిత్రలోకెల్లా అత్యంత హింసాత్మకమైన అంకం యేమిటంటే – స్పష్టమైన లెక్కింపు, వర్గీకరణ (కేటగరైజేషన్) యిది వ్యాపారహింసకీ, సామ్రాజ్యవాద హింసకీ కూడా దారి తీసింది.

యీ విధంగా హిస్టరోగ్రఫీ అనేది డెమోగ్రఫీతో ముడిపడిపోయింది, యిది స్పష్టంగా వర్గీకరించడం, గణించడం, గుర్తించడం అనే ప్రాసెస్ మీద ఆధారపడింది. ప్రతీదాన్నీ స్పష్టం చెయ్యాలని, మిస్టరీగా ఏదీ మిగలకూడదనే దృక్పథం ఆధునికత వల్ల బలపడింది. బీయింగ్ ఇన్ ఇట్ సెల్ఫ్‌గా ఏదీ వుండకూడదనే మానవ కేంద్రక దృష్టి బలపడింది. యిది విశ్లేషణని పెంచి, ఏ విషయాన్నైనా వొక పూర్ణంగా సమగ్రాకృతిగా అనుభూతి చెందే శక్తిని క్షీణింపజేసింది. యిది మనిషిని గుర్తించే క్రమంపై ప్రభావం వేసింది. యీ దృక్పథంలో మార్పు కమ్యూనల్ రాజకీయాలకి తాత్విక భూమికగా పని చేసింది.

అంటే గతాన్ని గుర్తుంచుకోవడంలో స్మరించు కోవడంలో వచ్చిన మార్పే చరిత్ర. నిష్పాక్షికంగా వస్తు గత ఆధారాలని ఆలంబన చేసుకుని చరిత్ర అభివృద్ధి చెందుతుంది అని చరిత్రకారులు అంటారు. కాని నిజానికి దృష్టే సృష్టి. మన దృక్పథాన్ని బట్టి దృశ్యం రూపుదిద్దుకుంటుంది. చరిత్ర కూడా అంతే.

ఐతే సనాతన పౌరాణిక కల్పనల్లో వొక విషయాన్ని బహుళంగా అనంతంగా చూడడానికి అవకాశం వుంది. ఎందుకంటే ఆ కథనాల తాత్విక భూమిక 'అనంతం' అనే దృక్పథం మీద ఆధారపడింది. పౌరాణిక కథల్లో కాల్పనికతకి గౌరవం వుంది. కాల్పనికత అంటే

అవాస్తవం అని అర్థం కాదు. వాస్తవాన్ని మించినది. దృశ్యమాన తక్షణ వాస్తవాలకి అతీతమైనది అనే అర్థం.

ప్రాచీన పౌరాణిక కథనాల్లో భిన్న కాలాలకి చెందిన వ్యక్తులు కూడా వొకచోట కలిసినట్లు వారి మధ్య సంవాదం జరిగినట్లు కథలు వుంటాయి. ఉదాహరణకి కుమారిలుడు–శంకరాచార్యులు, పోతన–శ్రీనాథుడు... వీరు పరస్పరం భిన్న శతాబ్దాలకీ కాలాలకీ చెందినవారని చరిత్రకారులు చెపుతారు. కాని ప్రాచీన కథల్లో వీరి కలయిక తాత్వికమైన, స్వభావపరమైన వైరుధ్యాల్ని బయటపెడ్తుంది. కాని చరిత్ర తాను ఫక్తు వాస్తవాలపై ఆధారపడ్డానని బొంకుతుంది. స్థలకాలాలని నిర్దిష్టంగా గుర్తిస్తానని నమ్మబలుకుతుంది. కాని చివరికి ఆ చరిత్రని రచించిన వారి పాక్షిక దృష్టినే ప్రతిబింబిస్తుంది.

ఆర్యుల దాడి సిద్ధాంతం చరిత్ర రచనలో చాలా కాలం రాజ్యం చేసింది. చివరికి అది తుస్సుమంది. వేదాలలోని కృష్ణ శ్వేత వర్ణాల ప్రసక్తి సింబాలిక్ అని తేల్చారు. జాతి వివక్షనీ, నల్ల తెల్ల రంగు గల జనాల మధ్య ఘర్షణని సూచించదు అన్నారు. యుద్ధం, ఘర్షణ అనే పదాలకి ప్రాచీన కావ్యాలలో, శ్రుతులలో, తాత్విక బోధనలలో చాలాలోతైన ఆంతరంగికమైన అర్థం వుంది. అంతఃస్సంఘర్షణ అనే అర్థం వుంది. బుద్ధుడూ, శివుడూ కూడా యుద్ధం చేశారు. కాని అంతశ్శత్రువుతో. శివుడు మన్మధుణ్ణి దహనం చేశాడు అంటే ఫక్తు భౌతికమైన అర్థం యివ్వకూడదు కదా. కాని చరిత్ర ప్రతిదాన్నీ వాచ్యతలోకి దిగజార్చాలని చూస్తుంది.

అసలు ఆధునికతలోని ప్రధానలోపమే అది. ప్రతి దాన్నీ వాచ్యమూ, స్పష్టమూ అయ్యే విధంగా చెయ్యడం, ధ్వని ప్రాధాన్యాన్ని తగ్గించి వెయ్యడం.

యీ వాచ్యత యొక్క అధమ స్థాయి వ్యక్తీకరణే హిందూత్వ. అందుకే హిందూత్వ వాదుల వ్యక్తీకరణలు అన్నీ చరిత్ర మీదే ఆధార పడ్తాయి. హిందూత్వ వాదులు ఎక్కువగా స్వదేశీ–విదేశీ, హిందూ–ముస్లిం, స్వమతం–విమతం వంటి ఆధునిక వలస చారిత్రక పదజాలం చుట్టూ చక్కర్లు కొడ్తారు.

నిజానికి స్పష్టమైన భౌగోళిక సరిహద్దు భావన ఆధునికమైనది. జంబూద్వీపం, భరతవర్షం, భరతఖండం అనే పదాలు కనబడ్తాయి. అదే సమయంలో సమీపంలోని నదుల పేర్లు కనబడ్తాయి. కృష్ణ గోదావరి లేక గంగానదుల పేర్లు, కాని స్పష్టమైన జాతీయ సరిహద్దులు ఆధునికమైనవి.

ప్రాచీన గ్రంధాలలో వేరే ధర్మానికి చెందినవాడు అనే అర్థంలో మ్లేచ్ఛ పదం కనబడ్తుంది. అదే రకంగా అవైదికం అనే పదం కూడా కనబడ్తుంది. శంకరాచార్యులు బ్రహ్మసూత్ర భాష్యంలో వాసుదేవ ఆరాధనా విధానాన్ని అవైదికం అన్నారు. అంటే అస్తిత్వాల గుర్తింపు ప్రాచీన కాలంలో చాలా వైవిధ్య భరితంగా వుంది. కాని ముస్లిం, క్రైస్తవ పదాలు వలసవాద పూర్వ గ్రంథాలలో ఎక్కువగా కనబడవు. ముఖ్యంగా సంస్కృత గ్రంథాలలో కానరావు. తాత్వికులు రామానుజ మధ్వాదులు కాని, వేదభాష్యం రాసిన సాయణుడు కాని, 14వ శతాబ్దంలో వివిధ తాత్విక శాఖలని సంకలనం చేసిన మాధవాచార్యులు (సర్వ దర్శన సంగ్రహం) కాని ఆయా మతాల గురించి ప్రసక్తి తీసుకురారు. పైగా ద్వైత అద్వైత విశిష్టాద్వైతాది వైదిక సిద్ధాంతాలలో అంతర్గతంగా నింద-ప్రతి నింద, పరస్పర చర్చ కనబడేవి.

18వ శతాబ్దానికి చెందిన విశ్వ గుణాదర్శ చంపువులో ముస్లిం ప్రభువుల క్రూరత్వం గురించి ప్రసక్తి వుంది. కాని అంతిమంగా వారి యుద్ధ కుశలతని, పరాక్రమాన్ని గ్రంథకర్త వెంకటాధ్వరి మెచ్చుకుంటాడు. పైగా ముస్లిం ప్రభువుల సంస్థానాల్లోని బ్రాహ్మణులు అవినీతిపరులు అని రాస్తాడు. 17వ శతాబ్ధికి చెందిన కైవారం నారాయణ తాత కాలజ్ఞానంలో, అంతర్గత కలహాల వల్ల యింగ్లీషు వాళ్లు నశించి ముస్లిం పరిపాలన తిరిగి వస్తుందన్నాడు. బ్రిటీష్ కాలానికి చెందిన శృంగేరీ శంకర పీఠాధిపతి చంద్రశేఖర భారతీ స్వామి ముస్లింలు హిందూ వ్యతిరేకులు అనే ప్రచారం బ్రిటీష్ క్రైస్తవులు స్వార్థంతో చేశారని, దాన్ని నమ్మవద్దని శిష్యులకి చెప్పేవారు.

యిక్కడ వివిధ దశలు మనం చూడవచ్చును. ఒకటి యితర సంస్కృతులు మతాల పట్ల నిర్లిప్తత, రెండు ముస్లింల పట్ల ద్వేషాన్ని, వ్యతిరేక ప్రచారాన్ని నిరసించడం, అంటే ప్రతి స్పందించడం మొదలు పెట్టారు. మూడు ముస్లిం ద్వేషం.

అంటే నిర్లిప్తత స్థానాన్ని చారిత్రక క్రియాశీలత నిమ్మదిగా ఆక్రమించింది, హిందూత్వ జన్మించింది.

ఉదాసీనో మహా బల: నిర్లిప్తంగా వుండేవాడే బలవంతుడు ఊరుకోవడమంత ఉత్తమంలేదు, బోడి గుండంత సుఖంలేదు అని సామెత.

సుందోపసుందన్యాయం అని సనాతన తాత్వికతలో ప్రసిద్ధం. సుందుడు ఉపసుందుడు అనే రాక్షసులు పార్వతీ దేవి కోసం తపస్సు చేశారు. దేవి ప్రత్యక్షమై వరం కోరుకొమ్మంది. ఆమె సౌందర్యానికి ముగ్ధులై ఆమె పొందునే వరంగా కోరారు. అప్పుడు దేవి "మీరు

ద్వంద్వ యుద్ధం చేయండి గెలిచినవానికి దక్కుతాను" అంది. చివరికి కొట్లాడుకొని యుద్ధరూ చనిపోయారు. సత్కార్య వాదం, అసత్కార్యవాదం మధ్యలో వాదోపవాదాలు జరుగుతున్నపుడు నిర్లిప్తంగా వున్న వాడే విజేత అని అద్వైతులు చెప్పారు. సృష్టికి కర్త వున్నాడు, సృష్టికి కారణం వుంది అనేది సత్కార్య వాదం. దానిని పూర్తిగా కాదు అనేదే అసత్కార్యవాదం.

నిర్లిప్తతకి తాత్విక సమర్థన వుంది భారతీయ తత్వంలో. ఎందువల్లనంటే కార్యకారణ అభేదం, ద్వంద్వాల పరస్పర ఆశ్రితత్వం, ద్రష్ట దృశ్యాల మధ్య అవినాభావ సంబంధం వంటి తాత్విక ప్రతిపాదనలు నిర్లిప్తతకి దారితీశాయి. కాని వలసక్రైస్తవం, దానిపై ఆధారపడ్డ చారిత్రక దృష్టి నిర్లిప్తతని బద్దలుచేసింది. అంతే కాదు ఎప్పటికీ కలవలేని భిన్న ధ్రువాల వంటి బైనరీ అపోజిట్స్‌ని సృష్టించింది. దాని ఫలితమే హిందూ–ముస్లిం ద్వేషం. అందుకే హిందుత్వ ప్రచ్ఛన్న క్రైస్తవం తప్ప మరేమీ కాదు.

ఐతే 'హిందూత్వ' భారతీయతత్వాన్ని కుదించి వేసింది. ఫక్తు రాజకీయంగా మార్చేసింది. సనాతన ధర్మం ప్రకారం యుగభావన చరిత్రపై ఆధారపడిలేదు రాముడు లాగే రామరాజ్యం అనే భావవని కబీర్ కాని గాంధీ కాని కేవలం రాజకీయ దృష్టిలో వాడలేదు. రామజన్మభూమి పూజారి లాల్‌దాస్ కూడా అంతే. యీ సనాతన దృష్టి ప్రకారం కాల చక్ర భ్రమణం అనివార్యం. అమావాస్య పున్నములులాగే మంచి చెడుకాలాల నిరంతర పునరావృత్తి అనివార్యం. కాని కాలాన్ని రాజకీయ దృష్టితో నిర్వచించారు హిందూవాదులు. అంతర్ముఖత్వాన్ని తొలగించారు. దానితో బహుముఖీనత నశించింది.

'హిందూత్వ' జాతి విద్వేష రాజకీయాన్ని ఆశ్రయించింది. దీంతో హిందూత్వ కథనాలు స్పష్టతని ఆశ్రయించాయి. ఆ స్పష్టత యేమిటంటే – ముస్లింలకి స్థానం లేని హిందూ చరిత్ర. అదే రామరాజ్యం.

ప్రాచీన గ్రంథాలలో రాగద్వేషాలు కనబడడానికి అవకాశం వుండేది. ఒకే రామాయణాన్ని సీత దృష్టి నుంచి, రాముడి దృష్టి నుంచి, రావణుడి దృష్టినుంచి, యివేమీ కాకుండా ఆధ్యాత్మ రామాయణంలా అన్నిటి పట్ల నిర్లిప్తత వహించే అద్వైత దృష్టి నుంచి కూడా నిర్వచించే విభిన్న కథనాలకి ఆస్కారం వుండేది. యిటువంటి బహుళ వ్యాఖ్యానాలకి నిర్వచనాలకి ముగింపు పలికింది చారిత్రక దృష్టి. ఆ చారిత్రక దృష్టిని జాతి విద్వేష రాజకీయంగా మలుచుకొంది హిందూత్వ.

దీనితో నవనాథ్ సంప్రదాయం నుంచి యోగి ఆదిత్యనాథ్ లాంటి జాతి విద్వేష పరులు జన్మించారు. నిజానికి యీ సంప్రదాయానికి చెందిన వారే నిసర్గ దత్త మహారాజ్. నిసర్గ దత్త మహరాజ్ మొదట వ్యవసాయదారుడు. తరువాత చిన్న దుకాణదారు. ఆయన అంతర్ముఖీన దృష్టి అద్వైత దృష్టికి దారి తీసింది. ఆయన బోధనలని పొందు పరిచిన పుస్తకం పేరు 'ఐయామ్ దట్' నేనే సత్యాన్ని అని ఆయన ప్రకటించుకొన్నారు. అటువంటి మహానుభావుడి సంప్రదాయ వారసుడు యోగి ఆదిథ్యనాథ్. ముస్లింలపై అత్యాచారాన్ని హింసనీ హిందూత్వగా నిర్వచించిన తీవ్ర హిందూవాది. దీనికి కారణం దృష్టిలో వచ్చిన మార్పు. సంకుచితమైన వలస చారిత్రక దృష్టి భారతీయ తాత్విక దృష్టిని కుదించి, జాతి విద్వేష రాజకీయంగా మలచింది. నవనాథ్ సంప్రదాయం ముస్లిం సూఫీ తత్వం నుంచి పుట్టింది. కానీ ఆ సంప్రదాయం నుంచి వచ్చిన యోగి ఆదిత్యనాథ్ ముస్లిం ద్వేషి, రేషిస్టు కావడం విషాదకరం.

హిందూ రాజకీయాలకి పట్టణ మధ్యతరగతి, ఆధునిక విద్యావంతులే ప్రధాన వనరుగా వున్నారు. దానికి కారణం వారిలో సనాతన నిర్లిప్తత, వలనవాద విద్య ప్రభావం వల్ల అంతరించింది. పైగా చరిత్ర వారిలో క్రియాశీలతని పురిగొల్పింది. చారిత్రక దృష్టి ఆక్రియాశీలతని విద్వేష రాజకీయంగా మలచింది.

భారత ఖండంలో బహుళ కథనాలూ పురాణాలు విరాజిల్లుతూ వచ్చాయి. సంస్కృత పురాణాలే కాదు, శూద్రుల అతిశూద్రుల దళితుల పురాణాలు వున్నాయి. జ్ఞానం బ్రాహ్మణుడి సొత్తు కాదు. నిజానికి వేదాలని అంటే తమ వద్దవున్న జ్ఞానాన్ని బ్రాహ్మణుడైన వశిష్టుడు దొంగిలించాడు అని మాదిగల కుల పురాణంలో బ్రాహ్మణుల ప్రవృత్తిపైన విమర్శ వుంది. యీ జాంబ పురాణాన్ని చిందు పురాణ కళాకారులు, దక్కలి వారు సంప్రదాయంగా చిరకాలంగా కథగా చెప్తూ వచ్చేవారు. ఎవరికీ అభ్యంతరం వుండేది కాదు. చిందు ఎల్లవ్వ గమనించిన దేమిటంటే – ఆధునిక కాలంలో బ్రాహ్మణుల నుంచి యీ కథల పట్ల అభ్యంతరం మొదలైంది.

యిలాంటి నిమ్నకులాల పురాణాల్లోనే కాదు, ప్రాచీన సంస్కృత గ్రంథాల్లోకూడా బ్రాహ్మణులపై విమర్శలు వుండేవి. కాని అటువంటి విమర్శపై ప్రాచీన కాలంలో పూర్తిగా నిషేధం లేదు కాని ఆధునిక విద్య అస్తిత్వాలని ఘనీభవింప జేసింది. కుల దురహంకారాన్ని పెంచి పోషించింది.

ఆధునిక కులతత్వానికి ప్రాచీన కులాలతో సంబంధం లేదు. బ్రిటిష్ జనాభా గణన అనంతరం కులాలు పూర్తిగా ఘనీభవించి పోయాయి. బ్రిటీష్ వారు హిందూ–ముస్లిం

అని కమ్యూనిటీలని నిర్ధారించడమే కాదు, అన్ని కులాలను నాలుగు వర్ణాలు బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులుగా విభజించివేశారు. నిజానికి గ్రంథస్థంగా మాత్రమే వున్న వర్ణ విభజనని వ్యవస్తీకరించారు. అలాగే కొన్ని కులాలని క్రిమినల్ కులాలుగా, మరి కొన్ని కులాలని యుద్ధ కులాలుగా వర్గీకరించారు, స్థిరపరిచారు. యింత స్పష్టమైన విభజనని రాజ్యం కల్పించుకొని చేయడం అనేది బ్రిటీషుకాలంలోనే జరిగింది.

కులాల, కమ్యూనిటీల స్థిరీకరణ పరస్పర ప్రభావాన్ని నిలిపివేసింది. బ్రాహ్మణుల సంస్కృతి, శూద్రుల సంస్కృతినీ, శూద్రుల సంస్కృతి బ్రాహ్మణుల సంస్కృతినీ ప్రభావితం చేసేవి. కులాలు ఘనీభవించకపోవడం వల్ల యిది సాధ్యమయ్యేది.

కుల సంస్కృతులూ, బహుళ సంప్రదాయాలు నశించి పోయి శూన్యం ఏర్పడింది. ఆ శూన్యం జాతి విద్వేష రాజకీయంతో పూరించబడింది. సంస్కృతిని కోల్పోయిన కులాలు (ఖాళీ కులాలు) కులనిర్మూలన భావనవైపు ప్రయాణం చేశాయి. కుల నిర్మూలన హిందూ జాతి భావనగా పరివర్తన చెందింది.

'హిందూత్వ' అనేక కులాలని సమీకరించగలగడానికి కారణం దానిలో ఆధునిక కులనిర్మూలన భావం వుండడం, సాంస్కృతిక బహుళత్వం పట్ల వ్యతిరేకత వుండడమే కారణం. అది ఇతర పార్టీలకన్నా ఎక్కువగా బీసీలని సమీకరించింది అంటారు కంచ ఐలయ్య.

గుజరాత్ మతకలహాలలో గిరిజనులు, దళితులూ క్రియాశీల పాత్ర పోషించడం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. కులాలూ జాతులూ ఆధునికతలో భాగమయ్యే కొద్దీ 'హిందూత్వ' గొడుగు కింద సమీకరించబడడం సులభమౌతోంది. మతతత్వానికి ఆధునిక విద్య చేస్తున్న దోహదం గురించి పరిశోధన జరగాలి.

వొకప్పుడు పశ్చిమబెంగాల్ లో ఎప్పటికీ వోడిపోని పార్టీగా కమ్యూనిస్టు పార్టీ వుంది. యిప్పుడు సుదీర్ఘ కాలం విజయపరంపర కొనసాగించే పార్టీగా బిజెపి అవతరించింది. యింకా మనం బిజెపిని కేవలం బ్రాహ్మణ బనియా పార్టీగా విశ్లేషించడం సులభమే కాని వాస్తవం కాదు. కులాన్ని ప్రాచీన గ్రంథాల ద్వారా అంచనా చెయ్యడం వొక పద్ధతి. కాని దీనివల్ల కులాన్ని దాని ప్రస్తుత రూపంలో అర్థం చేసుకోవడం అసాధ్యం.

కులాన్ని జాతీయ స్థాయిలో అంచనా వెయ్యడం మరో పద్ధతి. జాతీయ స్థాయిలో బ్రాహ్మణ వైశ్యకులాలు వ్యాపారంలో ఉద్యోగాలలో కీలక స్థానాల్లో యిప్పటికీ కొనసాగుతున్నారని, అది వారిని సమాజాన్ని శాసించే శక్తిగా నిలిపి వుంచిందని కొందరు అంటారు.

యివన్నీ స్థూల పద్ధతులు. సూక్ష్మ స్థాయిలో అధ్యయనం చేస్తేనే, కులాలు నిర్వహిస్తున్న పాత్ర అర్థమవుతుంది. అప్పుడు రాష్ట్రాలలోనూ వివిధ ప్రాంతాలలోనూ వివిధ కులాలు నిర్వహిస్తున్న పాత్ర అర్థమవుతుంది. రాజకీయాలలో, వ్యాపారాలలో శూద్ర అతి శూద్ర కులాల విజృంభణ అవగతమౌతుంది. అలాగే యీ కులాలు హిందూత్వ బలపడడానికి చేస్తున్న దోహదం కూడా అవగతమౌతుంది.

ప్రతిచోట ప్రత్యక్షంగా హిందూత్వ పరిపాలనలోకి రాకపోవచ్చు. కాని స్థానిక పార్టీల మద్ధతు హిందూత్వ బలపడడానికి కారణమౌతుంది. ఉదాహరణకి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం. వొకప్పుడు ఉత్తర ప్రదేశ్‌లో బహుజన సమాజ్ పార్టీ బిజేపీతో ప్రత్యక్ష పొత్తు పెట్టుకొంది. ఆ సమయంలో మాయావతి గుజరాత్ అల్లర్ల పట్ల మౌనం వహించారు అన్న సంగతి మరువలేనిది. యిటువంటి వైఖరే బీజేపీ బలపడడానికి కారణమైంది.

వివాదాస్పద నాస్తిక వ్యాఖ్యలు చేసే కరుణానిధి బీజేపీకి దగ్గర అవుతున్న సూచనలు కనబడ్తున్నాయి. ఆత్మీయుల్ని అవినీతి కుంభకోణాల నుంచి బయటపడవేసే ప్రయత్నంలో హిందూత్వకి దగ్గర అవుతున్నారు. మొదలు కరుణానిధి హిందువులు అంటే దొంగలు అని అర్థం అంటూ వ్యాఖ్యానించారు. తరువాత దొంగలు అంటే హృదయాన్ని దోచుకొనే వారు అని ముక్తాయించి హిందూ అనే పదానికి ఎవరూ తేలేని ప్రశస్తని తెచ్చారు ద్రవిడ పార్టీ నేత కరుణానిధి. (కొన్ని దశాబ్దాలక్రితం రాణి శ్రీనివాస శాస్త్రి అనే సంస్కృత పండితుడు హిందూ అనే పదం నిందార్థకం అని గ్రంథమే రాశారు).

నిజానికి హిందూత్వని బలంగా వ్యతిరేకిస్తున్నట్లు కనబడే వారినుంచే బీజేపీ బలాన్ని పొందగలుగుతుంది. ఎందుకంటే 'హిందూత్వ', సంప్రదాయ విరుద్ధమైన ఆధునిక సిద్ధాంతం. అందువల్ల సంప్రదాయ వ్యతిరేక హేతువాద శక్తులనుంచే నిజమైన శక్తిని, బలాన్నీ హిందూత్వ పొందగలుగుతుంది.

అంబేద్కర్, పెరియార్ లాంటి వారు సంప్రదాయ వ్యతిరేకులు, అదే సమయంలో ముస్లిం కమ్యూనిటీకి వ్యతిరేకంగా తీవ్ర రేసిస్టు వ్యాఖ్యలు చేశారు. యిటువంటి వ్యాఖ్యలు ప్రచ్ఛన్న క్రైస్తవ హిందూత్వకి బలాన్ని చేకూరుస్తాయి, సమ్మతిని కలుగజేస్తాయి. మనుస్మృతిలాంటి ప్రాచీన గ్రంథాలపై ఫోకస్‌ని పెంచి, కులం యొక్క ఆధునిక రూపాన్ని గురించి కులం యొక్క స్థానిక వైవిధ్యరూపాల గురించి ఆలోచన పెరగకుండా చేశారు యిటువంటి ఆధునిక వాదులు.

యిటువంటి వైఖరి హిందుత్వ వాదులకి అనుకూలమైనది. ఎందుకంటే హిందూత్వవాదులు

కూడా ప్రొటెస్టంటిజంలా గ్రంథానికి ప్రాధాన్యతనిస్తారు. బహుళ సంస్కృతులని నిరాకరిస్తారు తద్వారా వొకే మూసని నిర్మిస్తారు.

రంగనాయకమ్మ కూడా అంతే. ఆమె సంస్కృత గ్రంథాలకి ప్రాధాన్యత నిస్తారు. బహుళ సాంప్రదాయక కథనాల గురించి మాట్లాడదు. యిలా సంస్కృత ప్రాచీన గ్రంథాలకోసం చాకిరీ చేస్తూనే అంబేద్కర్ సంస్కృత గ్రంథాలకోసం చాలా చాకిరీ చేశారని విమర్శిస్తారు రంగనాయకమ్మ.

ఆధునిక మేధావులు గ్రంథాలలో కూరుకుపోయి కుల మత అస్తిత్వాలని నిర్ధారించారు. కాని భారతఖండం ప్రధానంగా మౌఖిక సంస్కృతిపై ఆధారపడి వుంది. మనం పరిశోధించాలనుకొంటే ప్రధానంగా మౌఖిక సంస్కృతులను అధ్యయనం చెయ్యాలి. కుల పంచాయితీలను అధ్యయనం చెయ్యాలి. గిరిజన సంస్కృతులను అధ్యయనం చెయ్యాలి.

అదే సమయంలో ఆధునికత అన్ని కులాల వారిలోనూ తీసుకువస్తున్న స్వార్థ పూరిత పోటీ, దానివల్ల వచ్చే అవాంఛనీయ పరిణామాలని అధ్యయనం చెయ్యాలి. ఉదాహరణ గుజరాత్. యిటువంటి అధ్యయనానికి బ్రాహ్మణుడిని కేంద్రంగా నిలిపే పాత పద్ధతి సరిపోదు. స్థానిక ప్రత్యేక పరిస్థితులు, ఆధునిక విపరిణామాల అధ్యయనం అవసరం. అంటే మేక్రోలెవల్‌లో కాదు మైక్రోలెవల్‌లో అధ్యయనం అవసరం.

హిందూత్వకి హేతువాదం, ద్రవిడ సిద్ధాంతం, బహుజన వాదం వంటి ఆధునిక సిద్ధాంతాలు చేసిన దోహదాన్ని అర్థం చేసుకోవాలి, అప్పుడే హిందూత్వని అర్థం చేసుకోగలం. హిందూత్వకి మూలం మనుస్మృతి లాంటి గ్రంథాలలో లేదు. అయోధ్య లాంటి ఆధునిక వివాదాలలో వుంది.

బాబ్రీ మసీదు విధ్వంసం తర్వాత బాబ్రీ స్థలం మాదేనని వాదించిన వారిలో హిందూ వాదులతో పాటు నయా బుద్ధిస్టు దళితుడు ఉదిత్ రాజు కూడా వున్నాడు. హిందూ వాదులు ఆలయం కూల్చి మసీదు కట్టారని వాదించారు. బౌద్ధారామాన్ని కూల్చి మసీదు కట్టారని నవ్య బౌద్ధుడు, దళితుడు మేధావి ఉదిత్ రాజు కోర్టుకెక్కాడు. ఆయనకి అంబేద్కర్ భార్య సవితా అంబేద్కర్ మద్దతుపలికింది. చివరికి ఉదిత్ రాజు బీజేపీ పార్టీలో చేరిపోవడం అనివార్య పరిణామం. (మనువాదులతోబాటు దురాక్రమణదారులైన ముస్లింలు కూడా దళిత శత్రువులేనని ఉదిత్ రాజు వాదన)

యిక్కడ దళిత నవ్య బౌద్ధమూ, హిందూత్వ వొకే తర్కాన్ని ఆశ్రయించడం చూస్తాం మనం. రోహింగ్యాల జాతి నిర్మూలన చేస్తున్న బర్మా హీనయాన బౌద్ధులతో హిందూత్వ వాదుల

చెలిమిని చూస్తూనే వున్నాం. యీ పరిణామాలు అన్నిటినీ గమనిస్తుంటే, హిందూత్వ ఆధునిక హేతుబద్ధత నుంచి స్ఫూర్తిని పొందుతోందని తెలుస్తుంది. కొందరు ఎబీవీపీ విద్యార్థులు కూడా మనుస్మృతి దహనం నిర్వహిస్తుండడం యాదృచ్ఛికం కాదు. హిందూత్వ ఆధునిక సిద్ధాంతం.

నిజానికి దళిత కులాలపై మొదట దాడులు మొదలుపెట్టింది శూద్ర కులాలు మాత్రమే. యీ శూద్ర కులాలు వొకప్పుడు హేతువాద కమ్యూనిస్టు ఉద్యమాలకి సారధ్యం వహించినవే. వ్యాపార పంటలనుంచి నగర వ్యాపారాలలోకి యీ శూద్ర కులాలూ విస్తరించాయి.

వీరికి భిన్నంగా ఉత్తరాదిలోని హిందూత్వ శక్తులు కుల సమీకరణ ద్వారా హిందూ వాదానికి బలం చేకూర్చాయి. 'హిందూత్వ' కులాల సమీకరణ ద్వారా ఆవిర్భవించింది మతతత్వం. అందుకే దాని ప్రధాన శత్రువు మరో మతం ఇస్లాం. యీ ఉత్తరాది హిందూత్వకి దక్షిణాది శూద్రకులాలు మద్ధతు పలుకుతుండడం తదనంతర పరిణామం. యీ పరిణామం వల్ల శూద్ర కులాలు హిందూత్వ భాషని సొంతం చేసుకుంటున్నాయి. క్రమేపీ మత పరిభాష వాడడం మొదలుపెట్టాయి. ఐతే యీ మత పరిభాష పూర్తిగా ఆధునికమైనది.

ఎన్‌టీ రామారావు రావణుణ్ణి, దుర్యోధునుడిని హీరోలుగా చేసి సినిమాలు తీశాడు. నిజానికి యిలా చిత్రించడం కొత్తేమీ కాదు. భారతీయ కథనాల్లో నాయక ప్రతినాయకులు తారుమారవడం మామూలే, కాని ద్రవిడ ఉద్యమం, బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమం యిటువంటి చిత్రీకరణని తిరుగుబాటుగా భావించింది. వొకప్పుడు గాంధీని పైకెత్తిన హిందూత్వవాదులు, యిప్పుడు అంబేద్కర్‌ని పూజిస్తున్నట్లే రాముడికి బదులు రావణుడికి గుడి కట్టినా ఆశ్చర్యం లేదు. హిందువులని, పౌరాణిక అంశాలని వెటకారం చేసే గరం మసాలా ద్రవిడ వాది కరుణానిధి బీజేపీకి దగ్గర అవుతారని యెవరైనా అనుకున్నారా! మొట్ట మొదటి మతాంతరీకరణ వ్యతిరేక బిల్లు తమిళనాడులో అన్నాడిఎంకె ఆధ్వర్యంలో అమోదం పొందింది అనే విషయం మరిచిపోకూడదు.

నిజానికి బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమాలు బ్రిటీష్ కొలువులలో జాబుల కోసమే జరిగాయి. దీనిలో సంప్రదాయం సంస్కృతి పాత్ర శూన్యం. బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమ కారులు అందరూ బ్రిటీష్ వారికి సానుకూలురు. వలస వాదానికి భక్తులు. హిందూ వాదులూ అంతే (జ్యోతిబాపూలే మొదటి స్వాతంత్ర్య సంగ్రామాన్ని వ్యతిరేకించారు. అంబేద్కర్ యింగ్లీషు పరిపాలనని అవసరమైనదని భావించారు.) అవిధంగా వీరిద్దరికీ బంధుత్వం వుండనే వుంది.

నిజానికి వలసవాదానికీ, వలస సంస్కృతికి వ్యతిరేకంగా గిరిజనులు దళితుల నుంచి తిరుగుబాటు జరిగింది. బిర్సాముండా అనే గిరిజనుడు బ్రిటీష్ వారికీ క్రైస్తవ మిషనరీలకి వ్యతిరేకంగా సూర్యారాధనతో కూడిన సంప్రదాయాన్ని ప్రచారం చేశాడు. మాల దాసరులు క్రైస్తవ మిషనరీలకి వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారు (ఆంధ్రుల చరిత్ర–బిఎస్ఎల్ఎన్ హనుమంత రావు) యిలాంటి విషయాలపై లోతైన చర్చ జరగలేదు. కారణం సంస్కృతి అంటే బ్రాహ్మణులని, వారి వద్దనే వున్న సంస్కృత గ్రంథాలని ప్రచారం జరిగింది. ఆధునిక కాలంలో. పైగా కమ్యూనిస్టులు ప్రతి అంశాన్నీ ఆర్థికమైనదిగా విశ్లేషించారు. యీ వైఖరి సాంస్కృతిక అంశాలని మరుగు పరిచింది.

వలసవాద ప్యూరిటన్ దృష్టి కొన్ని ప్రజా సమూహాల వ్యక్తీకరణని గుర్తించనే లేదు. ఉదాహరణకి దేవదాసీల తిరుగుబాటు. బెంగుళూరు నాగరత్నమ్మ బ్రిటీషు వారు దేవదాసీ వ్యవస్థని రద్దు చెయ్యడాన్ని వ్యతిరేకించింది. దానివల్ల తమవారు ఆర్థిక సామాజిక గౌరవాన్ని కోల్పోతారని వాదించింది. అంతే కాదు దేవదాసియైన ముద్దుపళని రాసిన రాధికా సాంత్వనాన్ని అసభ్యమైనదిగా చిత్రిస్తూ నిషేధించడాన్ని వ్యతిరేకించింది. యీ క్రమంలో సంఘ సంస్కర్త, వలసవాదియైన వీరేశలింగం పంతులుని కూడా వ్యతిరేకించింది. యీ క్రైస్తవ ప్యూరిటన్ దృక్పథం వల్లే ఎం.ఎఫ్ హుస్సేన్ దేవతల నగ్న చిత్రాలపై హిందూవాదులు దాడి చేశారు. హుస్సేన్ దేశం వదిలి వెళ్లి పోయారు. సంతానం కోసం పర పురుషుడితో సంబంధం పెట్టుకొనే ఆచారాన్ని (నియోగపద్ధతి) వర్ణించిన తమిళ రచయిత పెరుమాళ్ మురుగన్ పై హిందూవాదులు దాడిచేశారు.

దేవీ దేవతల నగ్న చిత్రాలే మహా పాపమైతే, మన దేవాలయాలని ఏం చెయ్యాలి. కాళిదాసు కుమారసంభవంలో పార్వతీ పరమేశ్వరుల రతిక్రీడను వర్ణించాడు. జయదేవుని అష్ట పదులలో శ్రీకృష్ణుని రాసలీలలు పచ్చిగా వర్ణించబడ్డాయి. భాగవతంలోనూ అంతే. ఐతే ఆర్యసమాజ్ వ్యవస్థాపకుడు దయానంద సరస్వతి భాగవతాన్ని నిషేధించాలని బ్రిటీష్ వారిపై వత్తిడి తెచ్చాడు. పశ్చిమ బెంగాల్‌లో క్రమేపీ రసికుడైన భాగవత కృష్ణుడు కాక భారత కృష్ణుడు ఆదర్శంగా చిత్రించబడ్డాడు ఆధునిక యుగంలో.

హిందూవాదులు శ్రీ కృష్ణుణ్ణి కాక రాముణ్ణి ప్రధాన దైవంగా ఎంచుకోవడం లో క్రైస్తవ ప్యూరిటన్ దృక్పథం పని చేసి వుండవచ్చు. నిజానికి వారు శ్రీ కృష్ణుడు బోధించిన భగవద్గీతని హిందూ బైబిల్‌గా ప్రచారంలోకి తెచ్చారు కూడా. 'హిందూ మతం' కి అంతర్జాతీయ ప్రాచుర్యం తెచ్చిన వివేకానంద చేతిలో రెండు గ్రంథాలు వుండేవి 1) భగవద్గీత 2) ఇమిటేషన్ ఆఫ్ క్రైస్ట్. మనదంతా క్రైస్తవ అనుకరణే కదా?

భారత ఖండంలో ఆధ్యాత్మికత, శృంగారం కలగలసి వుండడాన్ని వైరుధ్యంగా మత రాహిత్యంగా పాశ్చాత్యులు చిత్రించారు. దాని ఫలితమే కావచ్చు, హిందూవాదులు బ్రహ్మచర్యానికి ప్రాధాన్యత నిచ్చారు. ఆరెస్సెస్ లాంటి సంస్థలు బ్రహ్మచర్యాన్ని ప్రోత్సహించాయి. సనాతన ధర్మంలో సన్యాసులు మాత్రమే శాశ్వత బ్రహ్మచర్యాన్ని అవలంబిస్తారు. దానికి భిన్నంగా సంఘసేవ కోసం బ్రహ్మచర్యం అనే భావనని ఆరెస్సెస్ లాంటి సంస్థలు ప్రాచుర్యంలోకి తెచ్చాయి. నిజానికి సంఘసేవకుడు గృహస్థుగానే వుండేవాడు. అతడు అతిథులకీ శిష్యులకీ ఆశ్రయం కల్పించేవాడు. దానికి భిన్నంగా సంఘసేవ కోసం బ్రహ్మచర్యం అనే భావనని ఆరెస్సెస్ ముందుకు తెచ్చింది. ఇప్పుడు రాజ్యాధికారంలో వున్న వారు తమని బ్రహ్మచారులుగా సన్యాసులుగా ప్రదర్శించుకోవడం అదనపు అర్హతగా మారుతోంది. బహుశ చర్చికీ రాజ్యానికీ గల అవినాభావ సంబంధంలాంటి దాన్ని హిందూ వాదులు భారతదేశంలో ప్రవేశ పెట్టాలని చూస్తున్నట్లు కనిపిస్తుంది.

మనం జాగ్రత్తగా పరిశీలిస్తే రామాలయ నిర్మాణం ప్రారంభం కానేలేదు. దాని గురించి తొందరపడ్తున్న వారు కూడా కనబడరు. ఎన్నికల సమయంలోనే దాని ప్రసక్తి కనబడ్తుంది. కాని గాడ్సేకి, నరేంద్రమోడీకి గుడులు వెలిశాయి. అలాగే సర్దార్ వల్లభాయి పటేల్ విగ్రహం పెద్ద స్థాయిలో నెలకొల్పబడింది. (రామజన్మ భూమి కోసం గోల చేసిన అద్వానీ, మురళీ మనోహర్ జోషీలాంటి వాళ్లని కేసుల్లో యిరికించారు.)

నిజానికి మతం రాజకీయ అవసరంగా వర్ధిల్లుతూందే కాని దానిలో మత పరత్వం ఏమీ లేదు. వల్లభాయి పటేల్ విగ్రహం గురించి దేశవ్యాప్త ప్రచారం, నిధుల సేకరణ చూస్తే యీ విషయం తెలుస్తుంది. హిందూ అనేది ప్రధానంగా ఒక రాజకీయ సమీకరణ. యీ రాజకీయ సమీకరణలో రాముడి కన్న వల్లభాయిపటేల్ కాని మరొకరు కాని మరింత అవసరం అనుకొంటే వారి విగ్రహారాధన మొదలవుతుంది. రాజకీయ నాయకుల విగ్రహారాధన అనేది కమ్యూనిస్టుదేశాలలో కూడా వున్నదే.

కమ్యూనిస్టు విగ్రహారాధన కమ్యూనిస్టు పార్టీ నియంతృత్వం కిందికి అందరినీ జాతి భేదాలకి అతీతంగా సమీకరించాలనే వుద్దేశంతో మొదలైంది. హిందూపార్టీ 'హిందూ' నేషనాలిటీ గొడుగుకిందికి జాతులని సమీకరించేందుకు విగ్రహారాధన మొదలు పెట్టింది. ఐతే అంతిమంగా యే పేరుతో జరిగినా ఆధునిక కాలంలో జాతీయ దృక్పథంతోనే విగ్రహారాధన మొదలైంది. ఐతే కొన్ని ఆధిపత్య జాతులే చక్రం తిప్పుతాయి యెక్కడైనా. యిటీవల రాముడి ప్రసక్తికంటె సర్దార్ పటేల్‌ని ముందుకు తేవడానికి ప్రాధాన్యం యివ్వడం

జరిగింది. దేశానికంతటకీ గుజరాత్ వ్యాపార అభివృద్ధి నమూనాని అన్వయించాలని మోడీ అన్నారు. దానిలో భాగంగా అగ్రవర్ణ శూద్రకులానికి చెందిన పటేల్‌ని ముందుకు తేవడం ఆధునిక రాజకీయాలకి అనుగుణంగానే వుంది. వివేకానంద ఎప్పుడో చెప్పాడు. 'భవిష్యత్తు శూద్రులదే' అని. ముఖ్యంగా హిందుత్వ భవిష్యత్తు శూద్ర అతి శూద్ర కులాల మీదే ఆధారపడి వుంది. కాని కులాలు అనేవి జాతీయత మాట దేవుడెరుగు వర్ణం పరిధిలోకి కూడా యిమిడేవి కాదు. శూద్ర వర్ణం కింద ఎన్నో కులాలు వున్నాయి. పటేల్‌లు రిజర్వేషను కావాలంటూ ఉద్యమం మొదలు పెట్టారు. దాంతో హిందూ జాతీయతకి సింబల్ గా నిలిపిన పటేల్ విగ్రహం ఎదురు తిరిగి, కులంగా మిగిలింది.

భారత దేశవ్యాప్తంగా జాతీయతని నిర్మించడం కోసం ఎన్నుకొనే చిహ్నాలు అన్నీ యిలాగే యెదురు తిరుగుతున్నాయి. తాజ్ మహల్ శివుని గుడి అని, హిందూత్వ దృక్పథంతో రెచ్చగొట్టడానికి ప్రయత్నం జరుగుతోంది. కాని వీరశైవులు తాము హిందూ మతంలో భాగం కాము అనడంతో శివుడు జాతీయ చిహ్నంగా కాక తెగ చిహ్నంగా మారిపోతున్నాడు.

అనేక కులాలూ జాతులూ విభిన్న సంప్రదాయాలని వొకే జాతీయ చిహ్నం కిందికి సమీకరించాలనే ప్రయత్నం తిలక్ నుంచి నేటి వరకు విఫల మవుతూనే వుంది. దేవుళ్ళు నాయకులు ఎవరూ వొక వుమ్మడి చిహ్నంగా మారడం లేదు. హిందూ జాతీయవాదం, దానికి తోకయైన హిందూ మత భావనల్ని అసాధ్యం చేస్తోంది.

హిందూత్వ దృక్పథం ఏమాత్రం వైవిధ్యం లేనిది, ఏక శిలాసదృశమైనది. యీ మాట సారంలో నిజమే కాని వైవిధ్యాన్ని బహుళత్వాన్ని ముసుగుగా ధరించక తప్పని పరిస్థితి వుంది. దానికి కారణం భారత ఖండం సహజ సిద్ధంగానే వైవిధ్యభరిత సంస్కృతులతో నిండినది.

బహుళత్వాన్ని అవకాశ వాద రాజకీయంగా మలచింది హిందూత్వ. అందుకే హిందూ వాదుల ప్రకటనలు చాలా వైవిధ్య భరితంగా వుంటాయి. వారు ఎక్కువగా అందరినీ తమతో కలుపుకోవడంలో ముందుంటారు. వివిధ కులాలనే కాదు అనేక పార్టీలని తనతో కలుపుకు పోవడం ద్వారా హిందూత్వ బలపడ్తూ వచ్చింది. హిందూ మతాన్ని అంతర్జాతీయ స్థాయిలో ప్రచారంలోకి తెచ్చిన వివేకానంద బీఫ్‌ని భగవద్గీత అంత ప్రధానమైనదిగా ప్రకటించాడు. మళ్ళీ బీఫ్ నిషేధాన్ని అమల్లోకి తెచ్చింది హిందూత్వవాదులే. గాంధీని పూజించారు, అంబేద్కర్ని పూజించారు, గాడ్సేని కూడా ఆరాధిస్తున్నారు. అంటే భారతీయ బహుళత్వంలోని సమన్వయాన్ని ధ్వంసం చేసి శుత్రు వైరుధ్యంగా బైనరీ అపోజిట్స్‌గా

మారుస్తున్నారు హిందూత్వ వాదులు. అలా మార్చే క్రమంలోనే వివిధ అవకాశ వాద పూరిత నాటకాలు వేస్తున్నారు. గాంధీనీ గాడ్సేనీ ఏకకాలంలో ప్రొజెక్టు చెయ్యడం ద్వారా అవసరాన్ని బట్టి ఎటైనా జంప్ చేసే గోడమీది పిల్లి వాటాన్ని ప్రదర్శిస్తున్నారు. అధికారమే ప్రధానమైన చోట అవకాశవాదమే తత్వంగా మారుతుంది.

అధికారం హిందూవాదులకే ప్రధానం కాదు అందరికీ ప్రధానమే, కాని ప్రతివారూ తమ అధికార లాలసలో స్వార్థం లేదని అంటారు. ప్రజా ప్రయోజనాలే ముఖ్యమంటారు. అదే సమయంలో మతతత్వాన్ని ఫాసిజాన్ని నిరసిస్తున్నామంటారు. మరి భారతదేశంలో హిందుత్వ ఫాసిజం ఎలా బలపడింది? బీజేపి ఆకాశంలోంచి వూడి పడిందా?

**సెక్యులరిస్టులు – ముసుగు హిందూత్వవాదులు :**

ప్రతిదీ పూర్తి విరుద్ధంగా మారిపోతుంది అంటాడు మావో. నిజానికి టావోయిజంలో యిది ప్రధాన సూత్రం.

నిజానికి తమని సెక్యులరిస్టులుగా ప్రకటించుకునే వారి మద్దతులేనిదే హిందూత్వ యింతగా బలపడేదే కాదు.

అసలు జాతీయతా వాదంలోనే హిందూత్వ వాసనలు కనబడ్తాయి. తిలక్ యిందుకు ఉదాహరణ ఐతే గాంధీ బహుళత్వాన్ని రక్షిస్తూనే జాతీయ వాదాన్ని స్థాపించడానికి ప్రయత్నించాడు. హిందు ముస్లిం బాయిబాయి అనే నినాదాన్ని యివ్వడంలో కబీర్ వంటి భక్త కవుల ప్రభావం కనబడ్తుంది. చరిత్రని పక్కన బెట్టి పౌరాణిక వైవిధ్యాన్ని వెలుగులోకి తీసుకురావడానికి ప్రయత్నించాడు. విశిష్టాద్వైతం, జైన మతాల్లోని బహుళ దృక్పథాన్ని ఆధునిక సమాజానికి అన్వయించడానికి ప్రయత్నించాడు. రామ్ మనోహర్ లోహియా యీ దృక్పథాన్ని కొనసాగించడానికి ప్రయత్నించాడు. వీరు పురాణ ప్రతీకలని, జాతులని బైనరీ ఆపోజిట్స్‌గా మార్చలేదు. దానివల్ల వైరుధ్యాలు అంతర్గతంగా పరిష్కరించే మార్గాన్ని బలపరచడానికి ప్రయత్నించారు. ఉదాహరణకి రామ్ మనోహర లోహియా రామ–రావణ ఉత్సవాలు రెండింటినీ అనుమతించాలని అన్నారు. దానిలో వైరుధ్యాన్ని చూడలేదు.

నిజానికి భారతీయ దృక్పథంలో యిటువంటి సమన్వయం సాధ్యమే, ఎందుకంటే క్రైస్తవంలోలా దేవుడు (గాడ్) కి రాక్షసుడు అపోటిజ్ కాదు. రాక్షసులుగా వర్ణించబడే బలి, రావణాదులు కూడా పూజలు అందుకొన్నారు. రాక్షస శబ్దానికి రక్షించేవాడు అనే

అర్థం కూడా వుంది. రాక్షసుడు సైతాను కాదు. కాని యిలాంటి బైనరీ ఆపోజిట్స్‌ని సృష్టించే పనిని హిందూత్వ చేపట్టింది. దానికి వలస క్రైస్తవ ప్రభావమే కారణం.

ద్రవిడ ఉద్యమకారులు కూడా వలసవాద ప్రభావంతోనే రాక్షస పూజ మొదలు పెట్టారు. సాంప్రదాయిక పౌరాణిక దృక్పథం బీటలు వారింది.

మేఘాలయలాంటి చోట్ల గిరిజనులని ప్రకృతి పూజలనుంచి దూరం చేసి జాతీయ వాదంలో భాగం చెయ్యడం కోసం ప్రయత్నించారు ఆరెస్సెస్ వారు. దీనిని నెహ్రూ బలపరిచాడంటారు. గిరిజనులలోకి చొచ్చుకుపోయి వారికి విద్యాబుద్ధులు గరిపి ఆధునికతలో భాగం చెయ్యడం కోసం హిందూత్వ శక్తులు ఎప్పటినుంచో ప్రయత్నిస్తున్నాయి. యీ విషయంలో వారు క్రైస్తవ మిషనరీలని అనుకరిస్తూ వస్తున్నారు.

అసమానతలు లేనిదే ఆధునిక అభివృద్ధి లేదు. ఈ అసమానతలని అంగీకరించే విధంగా ఆధునిక విద్య వుంటుంది. హిందూత్వ వాదుల విద్యావిధానమైనా, క్రైస్తవ మిషనరీల విద్యావిధానమైనా, మావోయిష్టుల విద్యావిధానమైనా అంతిమంగా యింతేనని నిరూపించబడింది అది ప్రాచీన కమ్యూనిటీ జీవిత విధానాన్ని ధ్వంసం చేస్తుంది. వ్యక్తి స్వార్థాన్ని ప్రవేశపెడ్తుంది. ఘర్షణలో భాగమే మత కలహాలు కూడా. గిరిజనులూ, దళితులూ కూడా ముస్లింలపై దాడి చెయ్యడంలో వింత యేమీలేదు.

కర్ణాటకలో టిప్పు సుల్తాన్ వుత్సవాలని నిషేధించాలనే గోల చేసిన వాళ్ళలో హిందూత్వవాదులు, క్రైస్తవులూ కూడా వున్నారు. అంటే వలసక్రైస్తవ నాగరికతలో భాగమే హిందూత్వ. అందువల్ల హిందూత్వని విడిగా చూడడం కుదరదు.

ఫాసిస్టు నియంతృత్వ పోకడలు కూడా నేటి హిందూ ప్రభుత్వంతోనే మొదలు కాలేదు. ఇందిరాగాంధీ ఎమర్జన్సీ విధించింది కదా. ఐతే హిందూత్వ ఎమర్జన్సీకి వ్యతిరేకంగా పోరాటం చేసిన శక్తుల్ని తమలో కలుపుకుని బలహీనం చెయ్యడంలో విజయం సాధిస్తూ వచ్చింది. సోషలిస్టు జార్జి ఫెర్నాండెజ్ హిందూ ప్రభుత్వంలో కలిసిపోయాడు. కరుణానిధి రూపంలో ద్రవిడ వాదం కూడా హిందూత్వలో భాగం కాబోతోంది. బిఎస్పీ వొకప్పుడు బీజేపీతో పొత్తు పెట్టుకొని మత ఘర్షణల పట్ల మౌనం వహించింది. అవకాశ వాద రాజకీయ ఎత్తుగడలు ప్రజాస్వామ్యాన్ని బలహీన పరిచాయి.

రష్యాలో ఏం జరిగింది? స్టాలినిష్టు రష్యా నాజీలతో కొంతకాలం స్నేహపూరితంగా వుంది. అప్పుడు నాజీల దుర్మార్గాల గురించి మౌనం వహించింది. శాంతి వొప్పందాలు

బలహీనపడ్డాక నాజీలకి వ్యతిరేకంగా గొంతువిప్పింది. రష్యా రేడియో కూడా గొంతు మారుస్తూ వచ్చింది. యీ విషయం జార్జి ఆర్వెల్ రాశాడు. ఐతే స్టాలినూ, హిట్లరూ కూడా నియంతృత్వంలో ముగిశారు. రైట్ వింగ్ అండ్ లెఫ్ట్ వింగ్ ఆర్ టూవింగ్స్ ఆఫ్ సేమ్ బర్డ్ అంటాడు వొక రెడ్ యిండియన్.

నిజానికి నాజీ భావాలు ప్రగతిశీల మేధావుల నుంచే ఉద్భవించాయి. ప్రొటెస్టంట్ సంస్కర్త మార్టిన్ లూథర్ యూదులని తీవ్రంగా ద్వేషించాడు. యూదులని కట్టు బట్టలతో దేశం నుంచి తరిమెయ్యాలన్నాడు. మార్క్సు కూడా మెచ్చిన ప్రగతిశీల మేధావి గొథె రేసిజాన్ని సమర్థించాడు. లవ్ జిహాద్ సిద్ధాంతాన్ని రూపొందించి హిట్లర్ మన్ననలు పొందాడు. జర్మన్ స్త్రీలు యూదు పురుషులని వివాహం చేసుకోరాదని అన్నాడు. హెగెల్ రాజ్యనియంతృత్వాన్ని తాత్వీకరించాడు. యిటువంటి మేధావుల ఆలోచనలే నాజీ ఫాసిజానికి బౌద్ధిక సమర్థనని అందించాయి. భారతదేశంలో అంబేద్కర్, పెరియార్ రామస్వామి లాంటి సంస్కర్తలు ముస్లిం వ్యతిరేకతని సైద్ధాంతీకరించారు. మార్క్సు కూడా భారతదేశంలో తురక వాళ్లు కాక యింగ్లీషు వాళ్లు విజయకేతనం ఎగరవేయడం భారత పురోగతికి మంచిది అన్నాడు. నిజానికి భారతదేశంలో హిందూ ఫాసిస్టు భావాలు వలసవాదంతో, వలసవాద భావజాలంతో మిలాఖత్తు అయ్యాయి. జర్మనీలో ఫాసిస్టు నేషనలిజంలా హిందూ నేషనలిజంకి సొంత మూలాలు లేవు. యూరో భావ బానిసత్వం నుంచి హిందూ ఫాసిజం పుట్టింది. ఫాసిస్టు అడుగు పెట్టిన చోట సంభాషణ నిలిచిపోతుంది. భాష మరణిస్తుంది కనుక ఫాసిస్టులు ప్రగతిశీల రచయితల నుంచే తమ భావజాలాన్ని రూపొందించుకుంటారు. దాన్ని డైనమిక్‌గా అమలుచేస్తారు. ఫాసిస్టులు కార్యశూరులు, వారు ఆలోచనలతో పొద్దు పుచ్చరు.

రేసిస్టు ఫాసిస్టు భావజాల మూలాలు ప్రగతి శీలురుగా గుర్తింపు పొందిన మేధావులనుంచే ఆవిర్భవించడానికి కారణం ఏమిటి? బహుశా మొత్తంగా మానవ ఆలోచనలోనే, మానవ భాషలోనే పరిమితులు వున్నాయి.

నిజానికి ఆధునికత తీసుకువచ్చిన యూనివర్సలిజం ప్రకారం అందరు మనుషులు అన్ని జాతులూ వొకటే, అన్ని సంస్కృతులూ వొకటే. ప్రత్యేకతల్ని నశింపజేసి, అందరినీ వొకే జాతిగా తీర్చిదిద్దాలనే భావన యూరోపీయ ఆధిపత్యానికి, శ్వేత జాతి ఆధిపత్యానికీ దారితీసింది. దీనిపై ఆఫ్రికన్ మేధావులు చిను అబాబె, గుగీవంటి వారు తిరుగుబాటు చేశారు.

కన్నడ మేధావి డి.ఆర్ నాగరాజు యూనివర్సలిజం పేరుతో జాతుల, సంస్కృతుల ప్రత్యేకతల్ని తుడిచిపెట్టడాన్ని వ్యతిరేకించాడు. కర్ణాటకలో లోహియా ప్రభావం యిటువంటి విశాల దృష్టికి కారణమైంది.

కాని ఆంధ్ర దేశంలో తమిళనాడులో కమ్యూనిజం, హేతువాదం ప్రబలడం వల్ల సాంస్కృతిక మూలాలు నశించాయి. దానివల్ల భవిష్యత్తులో మరింత ఆధునీకరించబడిన హిందూత్వకి యీ రెండు రాష్ట్రాలనుంచి అవకాశం ఎక్కువ. సాంస్కృతిక ప్రత్యేకతలూ, బహుళత్వం హిందూత్వకి పెను సవాలు.

జాగ్రత్తగా గమనిస్తే గ్లోబలైజేషన్, టెక్నాలజీలో తీవ్ర మార్పులూ, సమాచార విప్లవం యిటువంటి అత్యాధునికతని వుపయోగించుకొని హిందూత్వ బలపడ్తూ వచ్చింది. నగర వాసులైన ఆధునిక విద్యావంతుల నుంచే యిది బలపడింది. మొదటి నుంచీ అంతే. ఆధునిక యింగ్లీషు విద్యనేర్చిన చిత్పవన్ బ్రాహ్మణులే హిందూత్వకి ప్రవక్తలుగా ఆవిర్భవించారు. యింగ్లీషు భాష ద్వారా హిందూత్వ బలపడింది. హిందూత్వ దృష్టిలో దేవ భాష యింగ్లీషు. సావర్కార్ హిందుత్వ యింగ్లీషులోనే రాశాడు, అరెస్సెస్ చెందిన గోల్వాల్కర్ తన ఫాసిస్టు భావాలని 'బంచ్ ఆఫ్ థాట్స్' పేరుతో యింగ్లీషులోనే పొందుపరిచాడు. సనాతనాన్ని సమాధి చేసి హిందూత్వ ఆవిర్భవించింది. కాకీ నిక్కర్లు ధరించి సంప్రదాయ వేష ధారణని రూపు మాపడానికి ప్రయత్నించారు ఆరెస్సెస్ వాళ్ళు.

హిందూత్వ వాదులు ప్రాచీన సంస్కృతికి వారసులని కమ్యూనిస్టులు ప్రచారం చేశారు తద్వారా వారికి లేని లక్షణాల్ని వారికి ఆపాదించారు. దళిత వాదులూ అదే చేశారు. దానిని ఆసరాగా తీసుకొని హిందూత్వవాదులు అనాది భారతీయ సంస్కృతి సంప్రదాయాలకి తామే వారసులమని ప్రకటించుకుంటూ వచ్చారు. నిజానికి హిందూత్వ వాదులు స్థానిక సంప్రదాయాలతో, తత్వంతో సంబంధంలేని వారు అన్న విషయం మరుగున పడిపోయింది. మరుగున పడడానికి కమ్యూనిస్టులూ, దళిత వాదులూ కూడా కారణమే. హిందూత్వం బలహీన పడాలంటే, వారి ఫాసిస్టు విదేశీ (యూరోపీయ) మూలాల్ని బయట పెట్టాలి.

**హిందూత్వ – ఇతర మతాలు :**

'హిందూత్వ' అనేది ముస్లిం అనే పదానికి వ్యతిరేక పదంగా ఆవిర్భవించింది. అందువల్ల పరత: ప్రమాణం, అంటే యితరమైన దాని మీద ఆధారపడి వుంది. దానికి స్వతంత్ర అస్తిత్వం లేనే లేదు.

ఐతే హిందూత్వకి ముస్లింలతో వున్నంత వ్యతిరేకత యితర మతాలతో లేదు. పైగా క్రైస్తవంతో, బౌద్ధంతో స్నేహపూర్వకంగా వున్న సందర్భాలు కనిపిస్తాయి. కాని యిస్లాంతో మాత్రం ద్వేషమే ప్రధానం.

జనాభా పెరిగి పోతుందనీ, టెర్రరిస్టులనీ, దేశభక్తి లేదు అనీ ప్రధానంగా ముస్లింలపైనే ముద్ర వేస్తారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలముందు క్రైస్తవులపై దాడులు జరిగాయి. అప్పుడు ఇండియాకి వచ్చిన అమెరికా అధ్యక్షుడు ఒబామా నిరసన వ్యక్తం చేశారు. వెంటనే మోడీ తన వైఖరి మార్చుకున్నారు. క్రైస్తవ మత పెద్దల సమావేశానికి స్వయంగా హాజరు అయ్యారు. క్రైస్తవ సెయింట్స్ తమకి ఆదర్శమన్నారు. క్రైస్తవులకి రక్షణ కల్పిస్తానని హామీ యిచ్చారు. యిటువంటి ప్రవర్తన ముస్లింల విషయంలో సాధ్యం కాదు. నిజానికి 'హిందూత్వ' ప్రచ్ఛన్న క్రైస్తవమే కదా!

గోవాలో యింగ్లీషు మీడియం పాఠశాలలకి విదేశీ నిధులని నిలుపు చేస్తానని బీజేపీ అంది. కాని అమలు చేయలేదు. ఈ విషయంలో ఆరెస్సెస్ బీజేపీకి మధ్య వివాదం రేగి, టీకప్పులో తుఫానులా అణిగిపోయింది. యోగి ఆదిత్యనాథ్ యూపీలోని అన్ని బడులలో ఇంగ్లీషు మీడియం అమలు చేస్తానన్నారు.

ఇటీవల బి.జె.పి. ముస్లింలకి హజ్ సబ్సిడీని రద్దు చేసింది. కాని ఈశాన్య రాష్ట్రాలలో ఎన్నికల సందర్భంగా క్రైస్తవులకి జెరూసలేం యాత్రని ఉచితంగా ఏర్పాటు చేస్తామని బి.జె.పి. హామీ యిచ్చింది. ఆ రాష్ట్రాలలో బీఫ్ బేన్‌ను రద్దు చేశారు. క్రైస్తవ అభ్యర్థులతో ఎన్నికల పొత్తుకు కూడా సిద్ధమైంది.

క్రైస్తవం ఆధునికతకి చిహ్నంగా మారింది. హిందువుల జీవితంలో క్రైస్తవం ముడిపడిపోయింది. క్రైస్తవం ఆధునిక విద్యావ్యాప్తికి చిహ్నంగా మారింది. అదే సమయంలో క్రైస్తవుల వలస చరిత్ర, థియాలజీ ముస్లిం ద్వేషాన్ని పెంచి పోషిస్తూవచ్చాయి. ద్వేషాన్ని పెంచి పోషించడంలో క్రైస్తవ మత ప్రచారసాహిత్యంని తక్కువ అంచనా వెయ్యలేము. హిందూత్వ దృక్పథంలో క్రైస్తవం అనివార్య భాగం.

క్రైస్తవ దృక్పథం భారతీయ సంస్కృతితో ముస్లింలకి గల అవిభాజ్య సంబంధాన్ని మరుగుపరించింది.

యిటీవలి కోరగాన్ వివాదాన్నేతీసుకోండి. మహారాష్ట్ర కోరగాన్‌లో మహర్లు బ్రిటీష్ సైన్యంలో జేరి పీష్వాలకి వ్యతిరేకంగా పోరాడడాన్ని స్మరించుకొంటూ దళితులు ఉత్సవాలు జరిపారు.

హిందూవాదులు వారిపై దాడి చేశారు. బ్రిటీష్ వ్యతిరేక జాతీయ పోరాటాన్ని వక్రీకరిస్తున్నారని వారి వాదన.

ఐతే బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాడిన పీష్వా సైన్యంలో ముస్లింలు చాలామంది వున్నారు. వారు యుద్ధంలో అమరులయ్యారు. పీష్వాల యుద్ధాన్ని జాతీయ యుద్ధంగా వర్ణించే హిందూత్వ వాదులు ముస్లింల బలిదానాన్ని గుర్తిస్తారా? మొత్తంగా బ్రిటీష్ వ్యతిరేక పోరాటంలో ముస్లింల త్యాగశీల పోరాట పటిమని అంగీకరిస్తారా? అసంభవం.

ఎందుకంటే ముస్లిం వ్యతిరేకత లేనిదే 'హిందూత్వ' లేదు. ఎందుకంటే హిందూత్వకి స్వాతంత్రోద్యమంలో భాగమేలేదు. వలసవాద దాస్యం నుంచి హిందూత్వ పుట్టింది.

హిందూత్వకి కాని బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమాలకి కాని వుండే సామాన్య లక్షణం వలసవాద సానుకూలత.

అందుకే హిందూత్వ వాదులు కాని బ్రాహ్మణ వ్యతిరేక వుద్యమ కారులు కాని బ్రిటీష్ సామ్రాజ్య వాదంపై పోరాడిన వాళ్ళని ఆదర్శంగా ఏ మాత్రం తీసుకోరు. బిర్సాముండా, అల్లూరి సీతారామారాజు, మంగళ్ పాండే వంటి వారు వారికి ఏమాత్రం ఆదర్శం కాదు.

వలసవాద ఆధునికతతో గల సంబంధం వల్ల, హిందుత్వ బ్రాహ్మణ వ్యతిరేక వుద్యమాల్ని, వారి భావజాలాన్నీ తనలో లయం చేసుకొంటూ వస్తోంది. చివరికి హిందూత్వ మాత్రమే మిగిలే ప్రమాదం వుంది.

బ్రాహ్మణ వ్యతిరేక వుద్యమ కారులు దళితవాదులది హిందూత్వతో వైర భక్తి మాత్రమే. అంటే శత్రుత్వంలా పైకి కనబడే భక్తి. అందువల్ల వారి శత్రుత్వం మిత్రుత్వంగా పరిణమించే అవకాశాలు ఎక్కువ.

అందుకే కంచ ఐలయ్య మోడీ గెలవగానే ఆనందం వ్యక్తం చేశారు. మొట్ట మొదటి సారిగా వొక బీసీ శ్రామిక కులం వ్యక్తి ప్రధాని అవడమే కాదు, తాను తక్కువ కులం వాడినని నిజాయితీగా ప్రకటించుకొన్నాడు అని పొగిడారు ఐలయ్య. మోడీ మరో అబ్రహాం లింకన్‌గా అవతరించవచ్చుననేంత వరకు వెళ్ళారు. గుజరాత్ అల్లర్లని ప్రస్తావించలేదు. పైగా హిందూత్వ బీసీలని సమీకరించగలిగిందన్నారు. బీజేపీలో చేరియైనా దళిత బహుజనులు రాజకీయంగా బలపడాలన్నారు.

అందువల్ల బ్రాహ్మణ వ్యతిరేక వుద్యమకారులకి హిందూత్వతో శాశ్వత శతృత్వం లేనేలేదు. సనాతన ఆలోచనలతోనే కాని ఆధునిక హిందూత్వతో వారికి వైరుధ్యం లేదు.

హిందుత్వకి ప్రమాదం కులనిర్మూలన వాదుల నుంచి కానే కాదు. వివిధ కులాల నుంచి తమ కుల అస్తిత్వాన్నీ సాంస్కృతిక ప్రత్యేకతలనీ బాహాటంగా ప్రకటించుకొంటూ వస్తున్న వారి నుంచే హిందూత్వకి ప్రమాదం వుంది. యిందుకు గుజరాత్‌లోని పరిణామాలే వుదాహరణ. అగ్రవర్ణమైన పటేల్, బీసీ, ఎస్సీ కమ్యూనిటీలు తమ ప్రత్యేకతలతో ముందుకు రావడంతో హిందూత్వ వాదులకి వణుకు పుట్టింది. అలాగే కర్ణాటకలోని వీరశైవులనుంచి కూడా భయం ఎదురైంది.

పోరాటరూపాలు కూడా ఆధునికమైనవి కావు. ఉనాలో జంతుకళేబరాలని పడవేసి నిరసన వ్యక్తం చేశారు. బీఫ్ పేరుతో జరుగుతున్న దాడులకి నిరసన యిది. వీర శైవ సన్యాసులు కూడా వీధులకెక్కారు. కన్నడిగులు మాతృభాషకి ఉద్యమరూపం యిచ్చారు. ముందు ముందు మరింత ఆధునిక పూర్వరూపాలలో ప్రత్యేకతలతో నిరసన వ్యక్తం కావచ్చు.

కమ్యూనిస్టులూ, నాస్తికులూ హిందూత్వకి వ్యతిరేకమైన భాషని నిర్మించలేక పోయారు. కారణం ఆధునిక పరిభాషవల్ల హిందూత్వ బలపడ్తుందేకాని బలహీన పడదు. స్థలకాలాల గురించి, సంస్కృతి గురించి, సకల విషయాల గురించి మన సనాతన తాత్విక దృక్పథాన్ని తిరిగి అన్వేషించి కనుగొన్నపుడు, దాన్ని జీవితానికి అన్వయించుకున్నపుడు మాత్రమే హిందూత్వ మరణిస్తుంది.

**ఉపసంహారం :**

'నిన్ను నువ్వు తెలుసుకో' అన్నాడు రమణ మహర్షి. వలసవాదకాలంలో భారతీయుల అస్తిత్వం చెదిరిపోయిన కాలంలో యీ పిలుపునిచ్చారు రమణ మహర్షి. యీ పిలుపు సామాజిక మైనది కాదు, నిజమే.

సామాజికం అనే భావన వలసవాద భావజాలం నుంచి పుట్టింది. అంతక్రితం వున్న సంఘం, కుటుంబ భావనలకి యిది భిన్నమైంది. ప్రతివ్యక్తీ ఉత్పత్తి చెయ్యాలి, ఉత్పత్తిని సంపదని పెంచాలి. అప్పుడే అతడు నిజమైన సామాజికుడు, పౌరుడు కాగలుగుతాడు. సమాజం వొక యంత్రం. దానిని నియంత్రించవచ్చుననేది ఆధునిక భావన.

రైల్వే వ్యవస్థ గ్రామీణ వ్యవస్థలో తీవ్రమైన కుదుపుని తీసుకువచ్చింది. గ్రామీణ వుత్పత్తులతో పాటు, మనుషులు కూడా వలసపోవడం పెరిగింది. ప్రతీవాడూ యేదోవొక నిర్దిష్టమైన పనిచేసి తనని తాను నిరూపించుకోవాలి, అంటే ఉత్పత్తి చెయ్యాలి.

కాని వలస పూర్వపు సమాజంలో యిటువంటి స్థితి కనబడదు. ప్రత్యక్ష ఉత్పత్తి చెయ్యని మనుషులు చాలామంది వుండే వారు. వీరు గ్రామీణులకి చేదోడు వాదోడుగా వుండే వారు అని, శ్రీకాంత్ నవలలో శరత్‌బాబు రాశాడు. యిప్పటికీ తెలంగాణాలో డక్కలివారు జాంబ పురాణం బోధిస్తూ మాదిగలపై ఆధారపడి జీవిస్తారు. ఇటువంటి ఆశ్రిత కులాలు ఎన్నో వుండేవి.

కాని వలసవాదం యిటువంటి సమాజాన్నీ జీవితాన్నీ స్తబ్ధమైనదిగా నిర్వచించింది. మార్క్సు ఆ భావాలనే ప్రకటించాడు. భారతీయ గ్రామాలలోనే కాదు, భారతీయుల మతంలో కూడా స్తబ్ధత వుందని మార్క్సు భావించారు. భారతీయులు గోవులాంటి జంతువులను పూజిస్తారు, వారు ప్రాకృతిక శక్తులకు బానిసలు. ప్రకృతిపై సార్వభౌముడైన మానవుణ్ణి ప్రకృతి స్థాయికి దిగజారుస్తుంది భారతీయ మత దృక్పథం. యిది మార్క్సు అభిప్రాయం – ఇటువంటి ఆలోచనలన్నీ క్రైస్తవ ఆలోచనలకి ప్రతిధ్వనులే.

అమెరికన్ పాఠశాలల్లో భారతీయులు (హిందువులు) జంతువులని పూజిస్తారు అని బోధించేవారు. హిందువులు కోర్టుకు వెళ్ళి సిలబస్ మార్పించారట. తమకి కూడా దేవీదేవతలు వున్నారని వాళ్లు వాదించి గెలిచారు. నిజానికి యిది డిఫెన్సివ్ మెకానిజమే. మానవ కేంద్రకదృష్టి లేకపోవడం భారతీయుల విశాల దృక్పథాన్నే చాటుతుంది.

ఐతే ప్రకృతిని, చెట్టు చేమలని, గోవుని పూజించడంలోని విశాల హృదయం లోపించి, గోవు అనేది ముస్లిం ద్వేషానికి ప్రతీకగా మారిపోవడం ఆధునిక పరిణామం. ప్రాచీన సాహిత్యంలో యిది కనబడదు. క్రైస్తవ దృక్పథం ఆవులాంటి జంతువులపట్ల మన దృక్పథంలో మార్పుని తెచ్చింది. ఆవు రాజకీయాలు మొదలయ్యాయి.

నిజానికి వలసవాదం, వలసవాద దృక్పథం మనని మానవ కేంద్రక దృష్టి వైపు నడిపింది. ప్రకృతినుంచి మనిషిని పూర్తిగా వేరే చేసింది. ఉత్పత్తికి ఎక్కడలేని ప్రాధాన్యాన్ని తెచ్చి, మనిషిని ఉత్పత్తి దారుడుగానో కొనుగోలు దారుడు గానో తప్ప సహజ అస్తిత్వం లేకుండా చేసింది. దీనితో మనిషి కార్పొరేటీకరణలో కరిగిపోయాడు.

అతని సనాతన ధార్మిక విశ్వాసాలు కూడా మార్కెట్టు అవసరాలకి అనుగుణంగా మలచబడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్టుతో అనుసంధానించబడ్డాయి. దానివల్లనే కొత్త స్వాములు వ్యాపారవేత్తలుగా అవతరించి బ్రాండ్ అంబాసిడర్లుగా మారారు. కాలుష్యం వల్ల, పరుగు వల్ల, పోటీవల్ల ఏర్పడిన ఆందోళనల్ని అనారోగ్యాన్నీ చిటికెలో మాయం

చేసే 'యోగ' తమ వద్ద వుందన్నారు. శాంతిని కూడా అమ్మగలమన్నారు. సహజ ఉత్పత్తులు తమ వద్ద వున్నాయన్నారు. నిన్ను నువ్వు తెలుసుకో అన్న రమణ మహర్షికి యీ వ్యాపార ప్రపంచంలో స్థానంలేదు. ఒక పౌరాణిక ప్రపంచంలో దేవీ దేవతల మధ్య జీవించిన రామకృష్ణ పరమ హంసకీ స్థానం లేకుండా పోయింది.

తప్పి పోయిన 'నేను' ని తిరిగి వెతికి పట్టుకోవాలన్న రమణ మహర్షి బోధనని వినేవాళ్లు ఎవరు? యీ వస్తు ప్రపంచంలో వస్తువుగా మారిపోయిన మనిషి నేనెవరు అని ఏకాంతంగా ప్రశ్నించుకొనే అవకాశం ఎక్కడ? పైగా ఆధ్యాత్మికత పేరుతో వస్తు ప్రపంచమే రాజ్యం చేయడం మొదలు పెట్టింది. పైగా అశాంతిని ముస్లిం ద్వేషాన్నీ రెచ్చగొట్టే స్వాములు హిందువుల గురువులుగా అవతరించారు.

'ఒక దళారీ పశ్చాత్తాపం' పేరుతో అమెరికన్ పెండోరా బాక్సుని బద్దలు కొట్టిన జాన్‌పెర్కిన్స్ మనుషులు ధ్యానస్థితిలోకి జారి, వినియోగ సంస్కృతికి దూరమైతే మార్కెట్టు వ్యవస్థ అంతరిస్తుంది అన్నాడు.

ఐతే ధ్యానాన్నీ, ఏకాంతాన్నీ బోధించే స్వాములే ప్రకృతి ఏకాంతాన్ని ధ్వంసం చేసే ఫక్తు వ్యాపార వేత్తలుగా అవతరించారు. ఆధ్యాత్మికతని అంగడి సరుకుగా మార్చేశారు. దీనికి ఉదాహరణ శ్రీశ్రీ రవి శంకర్. నదీతీరంలోని పర్యావరణాన్ని ధ్వంసం చేసినందుకు ఆయనని కోర్టు కూడా తప్పు పట్టింది.

అందువల్ల హిందూత్వ అనేది ప్రకృతి వ్యతిరేకమైనది. మానవ కేంద్రకమైన పెట్టుబడిదారీ వ్యవస్థనుంచి, వలసవాద భావజాలం నుంచి పుట్టింది. అందుకే యీ నాగరీకత మరింత పురోగమించేకొలదీ హిందూత్వ బలపడ్తూవచ్చింది. గ్లోబలైజేషన్ యుగంలోనే సామాజిక రాజకీయ శక్తిగా అవతరించింది.

రైల్వే వ్యవస్థ, ఆనువంశికమైన కులవ్యవస్థని బలహీన పరుస్తుందని మార్క్సు అన్నారు. బుల్లెట్ ట్రైను మాత్రం హిందూత్వ పురోగమనాన్ని మరింత వేగవంతం చేస్తుంది.

నేను రాసిన 'అమెరికనిజం' పుస్తకంలోని మాటలు యివి.

పశ్చిమ బెంగాల్లో కమ్యూనిస్టులు ప్రయత్నించి విఫలమైన అభివృద్ధి నమూనానే హిందూ గుజరాత్ అందుకొంది.

చివరికి మావోయిష్టులకి కూడా ప్రత్యేక తాత్విక దృక్పథం లేదు. వారిదీ మన ప్రభుత్వాల దృక్పథమే. ప్రకృతి మీద పగబట్టిన ఆధునిక అభివృద్ధి నమూనాయే. కాని మావోయిష్టులూ

కమ్యూనిష్టులూ మానవుడి గురించి మాట్లాడ్తారు. మానవతావాదాన్ని పలవరిస్తారు. పాత యూరోపియన్ భాషని వాడతారు. అది పాత చింతకాయ పచ్చడి. యిప్పుడది పనికి రాదు.

అదుపులేని అభివృద్ధి అంతు లేని స్వేచ్ఛ. అందులో మానవుడి ప్రసక్తి అసలే లేదు. ఈ మార్గం రామభక్తులకే బాగా తెలుసు. యూరోపియన్ క్రైస్తవులు క్రీస్తుని వదిలేశారు. హిందూ వాదులు రామున్ణి వదిలేశారు. యిద్దరూ బింబ–ప్రతిబింబాలు, ధ్వని ప్రతిధ్వనులు యిప్పుడు ఇద్దరూ దేవుడులేని మానవుడు లేని స్వేచ్ఛా విపణిని ఆరాధిస్తున్నారు.

క్రీస్తులేడు
రాముడూలేడు
చివరికి మానవుడూ లేడు
కేవలం మార్కెట్టు వుంది

(అమెరికనిజం)

**1857 :**

1857 అనే నాలుగు అంకెలు మన దృక్పథాన్ని శాసిస్తున్నాయి. నిజానికి భారతదేశానికి చరిత్ర 1857లో మొదలైంది. మన చారిత్రక దృక్పథానికి బీజాలు అక్కడే వున్నాయి అనిపిస్తుంది.

ఇంతకీ 1857 సిపాయిల తిరుగుబాటా, స్వాతంత్ర్య సంగ్రామమా యీ ప్రశ్నలకి తోడు, యీ మధ్య దళితులలో వొకవర్గం మరో ప్రశ్నని జత చేశారు. 1857 స్వర్ణ యుగానికి ప్రారంభమా, యీ తిరుగుబాటు వోడిపోవడం పీడితుల విముక్తిగా నిర్వచించవచ్చా ? బ్రిటీషు వారి విజయం భారతీయుల మంచికేనా ?

వొకప్పుడు ఆధునీకరించబడిన, వలసీకరించబడిన బ్రాహ్మణులు చేసిన నిర్వచనాలనే యిప్పుడు దళితులు అనుసరిస్తున్నారు. ఓడిపోయి పశ్చాత్తాపం ప్రకటించి వలసవాద విద్యనీ, సంస్కృతినీ తమదిగా చేసుకొన్నారు బ్రాహ్మణులు. ఆ బ్రాహ్మణులే నేటి దళితులకి మార్గ దర్శకులు. నిజానికి 1857 తిరుగుబాటు తర్వాత వలసవిద్య వలన బానిస భావజాలానికి బానిసలైన బ్రాహ్మణుల నుంచే హిందూత్వ భావజాలం రూపుదిద్దుకొంది. మొదట బ్రాహ్మణులు భౌతికంగా సాంస్కృతికంగా వలసవాదులతో తలబడ్డారు, పోరాడారు. (మంగళ్ పాండే, ఝాన్సీలక్ష్మీబాయి మొదలైనవారు) ఈ పోరాటంలో వోడిపోయారు. తర్వాత వలస వ్యవస్థలో భాగంగా మారుతూ వచ్చారు.

మొదట బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా సాయుధంగా పోరాడి లొంగిపోయిన వీర సావర్కార్ యీ మార్పుకి సూచిక. సావర్కార్ అండమాన్ ప్రవాస శిక్ష నుంచి బయటపడడానికి బ్రిటీష్ వారిని క్షమార్పణ కోరాడు. మొదట 1857 సిపాయిల తిరుగుబాటు మొదటి స్వాతంత్ర్య ఉద్యమంగా చిత్రిస్తూ గ్రంథం రాశాడు. తర్వాత బ్రిటీషు వారిని శరణువేడాడు. పాపాలని క్షమించమని, యింక పోరుబాటలోకాదు లొంగుబాటుతోనే జీవిస్తానని వేడుకొన్నాడు. ఆ లొంగుబాటుకి వస్త్వీకరణే హిందూత్వ గ్రంథ రచన.

ఇంచుమించు అదే సమయంలో జ్యోతిబాపూలే అనే బహుజన సంస్కర్త 1857 తిరుగుబాటుని నిరసించాడు. అది బ్రాహ్మణ వర్గాల కుట్ర అన్నాడు. ఆ తిరుగుబాటు వోడిపోవడం, బ్రిటీష్ పరిపాలన రావడం విముక్తి దాయకంగా ఆయన భావించాడు.

సావర్కార్, జ్యోతిబాపూలే (అంబేద్కర్ కూడా) రెండు భిన్నమైన అణచివేతలుగా బ్రిటీష్ పూర్వ భరతఖండ చరిత్రని చూశారు. జ్యోతిబాఫూలే, అంబేద్కర్‌లు దళిత బహుజన మెజారిటీవర్గాల్ని బ్రాహ్మణులు అణచివేశారని వ్యాఖ్యానించారు. సావర్కార్ ముస్లింలు 'హిందువు'లని అందర్నీ అణగదొక్కారని వ్యాఖ్యానించారు. ఐతే యిద్దరూ బ్రిటీష్ రాకపట్ల సానుకూల దృక్పథాన్ని కలిగివున్నారు. కనీసం యిద్దరూ బ్రిటీష్‌వారి అణచివేతని గురించి సిద్ధాంతీకరించడాన్ని నిరాకరించారు.

నిజానికి వందేమాతరం దేశభక్తి గీతం రచించిన బంకించంద్ర చటర్జీ యింగ్లీషు వాళ్లు రావడం వల్ల ముస్లింల హింసనుంచి బయటపడ్డామని అన్నాడు. అది దైవసంకల్పం అన్నాడు. వీరేశలింగం, గురజాడ లాంటి సంస్కర్తల అభిప్రాయం కూడా అదే.

మొత్తం మీద బ్రిటీష్ రాకకి ముందు భారతీయ గత చరిత్ర అంతా అణచివేత తప్ప మరేమీ కాదు. ఎవరు అణచివేశారు అనే దానిలోనే తేడా. బ్రిటీష్ వారిని అందరూ విముక్తి దాతలుగా చూశారు. తర్వాత కమ్యూనిస్టులనుంచి విరసం దాకా యిదే అభిప్రాయం కొనసాగింది.

యింకా సూక్ష్మంగా పరిశీలిస్తే హిందూత్వ వాదులకి దళిత వాదులకి మరింత సామ్యం కనబడ్తుంది. వివిధ వాదాలన్నీ వొకే తానులో గుడ్డే. క్రైస్తవులకి తక్షణ శత్రువు ముస్లింలు. దళిత వాదులకైనా హిందూవాదులకైనా తక్షణ శత్రువులు ముస్లింలే. అందుకే జ్యోతి బాఫూలే శివాజీ పావడా అనే గ్రంథంలో ముస్లింలు బ్రాహ్మణులని హింసించారని, 'హిందూ' సంస్కృతిని ధ్వంసం చేశారని తెగ బాధపడిపోతాడు. అంబేద్కర్ మరింత ముందుకు వెళ్లి ముస్లింలని జాతిగా, మతంగా అతి ప్రమాదకరమైన వాళ్లుగా ప్రకటించాడు. సైన్యంలో ముస్లింలు వుంటే దేశ భద్రతకి ముప్పు అన్నాడు. జనాభా మార్పిడి జరగాలన్నాడు. ద్రవిడ బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమ కారుడు పెరియార్ వలసవాద తత్వాన్ని వొకే వొక్క వాక్యంలో ప్రకటించాడు. "బ్రాహ్మణులని కాదు అని ముస్లింలని సమర్థించడం పెంట

మీది నుంచి మలం మీద కాలు వెయ్యడం లాంటిది”

ఇటువంటి ఉదాహరణలు చూపుతూ పెరియార్‌ని విమర్శించిన చంద్ర భానుప్రసాద్ దళితుడి డైరీ కాలంలో అమెరికా యుద్ధ ఉన్మాదాన్ని, దురాక్రమణని మాత్రం సమర్థిస్తాడు. ముస్లిం దేశాలపై అమెరికా సామ్రాజ్య వాద దాడి వల్ల స్త్రీలు విముక్తి చెందుతున్నారు అంటాడు. తద్వారా వలసవాద దృక్పథానికి అత్యాధునిక రూపం ఇస్తాడు. కంచ ఐలయ్య ఆలోచనలు కూడా యిటువంటివే.

ప్రస్తుతం మనం అమెరికనిజంలో జీవిస్తున్నాం. కంచ ఐలయ్య అంటారు అమెరికాలో ప్రొటెస్టెంటు తప్ప మరెవ్వరూ ప్రధానికాలేరు కాని ముస్లింలలో వుండే ఉగ్రవాద లక్షణాలూ, భారతీయులలోని సంకుచితత్వం అమెరికన్లకి లేదు అంటాడు. అంటే అమెరికన్ల మతతత్వం విశాలమైనది.

ఐతే భారతదేశంలో బహుళత్వం, మత సహనం వుందని వలసవాద మేధావులు కూడా అంగీకరించారు. యీనాటికీ భారతీయ ప్రగతి వాదులు అదే అంటారు. కాని భారతదేశంలో శాంతియుత వాతావరణం వున్నా ఆ వాతావరణం స్తబ్ధతకి చిహ్నం మాత్రమే. మార్క్సు అదే అన్నాడు. ఆ స్తబ్ధతకి మరో పేరు కులం.

బ్రిటీష్ పూర్వపు భారత ఖండంలో గ్రామాలలో కుల పంచాయితీలూ, కమ్యూనిటీ పంచాయితీలూ వుండేవి. అవి గ్రంధం మీద ఆధారపడిలేవు. ధర్మశాస్త్రాలు కూడా స్థానిక ఆచారాలకి ప్రాధాన్యం యిచ్చేవి. అలాగే గుడులలో చాలా చోట్ల శూద్రపూజారులు వుండేవారు. మనుస్మృతిని పట్టుకుని నిలుచున్న పెద్ద మనిషి విగ్రహం ప్రపంచంలో వొకటే వుంది. అది విలియం జోన్స్ విగ్రహం. ఆ విగ్రహం యింగ్లాండులో వొక పెద్ద చర్చిముందు వుంది.  ఆయన మనుస్మృతిని యింగ్లీషులోకి అనువాదం చేశాడు. (హిందూస్‌యాన్ ఆల్టర్నేటివ్ హిస్టరీ) బ్రిటీష్ వారు రికార్డు చేయడం, గ్రంథస్థం చేయడం, లేఖనం, ఫోటోల ద్వారా మౌఖిక సంస్కృతి స్థానంలో వొకే వొక వస్తుగత సత్యాన్ని మూస పద్ధతిని ప్రవేశపెట్టారు.

బ్రిటీష్‌వారు కులాన్ని కనుగొన్నారు. బ్రాహ్మణుడిని కనుగొన్నారు వొక యూనివర్సల్‌గా నిర్వచించబడిన కులాన్నీ, బ్రాహ్మణుణ్ణీ కనుగొన్నారు. క్రైస్తవ మిషనరీలు బ్రాహ్మణుణ్ణి ఆర్యజాతి ప్రతినిధిగా భావించారు. శూద్ర సంస్కృతులని అల్పమైనవిగా అనాగరికమైనవిగా చిత్రించారు. యూదు సంస్కృతులతో ఆచారాలతో పోల్చారు. వారి బలులని నిరసించారు బ్రాహ్మణుణ్ణి ఆదర్శీకరించారు. (రాబర్ట్, డి నొబిలి, వైట్ హెడ్ మొదలైనవారు)

ఒక బ్రాహ్మణ సంస్కృతి వలసవాదం వల్ల కనుగొనబడింది. నిజానికి శూద్ర సంస్కృతుల నిరాకరణ శూద్ర సంస్కృతుల బ్రాహ్మణీకరణ వైపు దారి తీసింది. బ్రాహ్మణీకరణ అంటే

క్రైస్తవీకరణ అని అర్థం. ఉదాహరణకి – దేవదాసీల విలాసినీనృత్యంని సంస్కరించి, దానిలోని శృంగార భావనల్ని తొలగించి భరత నాట్యంగా మార్చారు. పవిత్రీకరించారు. వొక విక్టోరియన్ నీతి మనని వెంటాడ్తూ వచ్చింది.

ఎం.ఎస్. సుబ్బలక్ష్మి గురించి టి.ఎం. కృష్ణ చేసిన వ్యాఖ్యానం గుర్తించ దగింది. ఎం.ఎస్. సుబ్బలక్ష్మి తన దేవదాసీ అస్థిత్వాన్ని దూరం చేసుకుంటూ, వొక బ్రాహ్మణ ఆదర్శ గృహిణిగా మారుతూ వచ్చింది. అది సంగీతాన్ని ప్రభావితం చేసింది.

వైష్ణవ భక్త కవయిత్రి అండాళ్లు దేవదాసి అని తమిళ సినీకవి వైరముత్తు అన్నారు. దానిపై హిందువాదులు వివాదం లేవదీశారు. దేవదాసి నిందార్థకం కాదు అని సమాధానం యిచ్చారు టి.ఎం. కృష్ణ.

ఇదంతా వలసవాద ప్రభావమే. వలసవాద విమర్శకి ప్రతిస్పందనే. అందుకే దేవదాసీలు సంస్కర్తలతో యుద్ధం చేయవలసివచ్చింది. ఉదాహరణ – వీరేశలింగం పంతులుపై బెంగుళూరు నాగరత్నమ్మ తిరుగుబాటు.

గతాన్ని అంతా తవ్విపోసిన డీడీ కోశాంబి వలసవాద కాలంలో ప్రారంభమైన బ్రాహ్మణీకరణ (క్రైస్తవీకరణ) గురించి మాట్లాడలేదు. సంస్కృతీకరణ గురించి పరిశోధించే సామాజిక శాస్త్రవేత్తలు బ్రాహ్మణీకరణ, సంస్కృతీకరణ సారాంశంలో క్రైస్తవీకరణ తప్ప మరేమీ కాదు అనే సత్యాన్ని గుర్తించనే లేదు.

బ్రాహ్మణీకరణ ముసుగులోని క్రైస్తవీకరణ వలసవాద పూర్వపు ఉమ్మడి సంస్కృతి గురించి విస్మరించేలా చేస్తుంది. ఉపనిషత్తులు, అనేక సంస్కృత శాస్త్ర గ్రంథాలు (గణితం, ఖగోళం, వైద్యం) ముస్లింల ద్వారా పర్షియన్ అరబిక్ భాషలలోకి అనువదించబడ్డాయి. అక్కడి నుంచి పాశ్చాత్య దేశాలలోకి జేరి వికాసవాద యుగాన్ని ప్రభావితం చేశాయి.

కాని పాశ్చాత్యుల అనువాదాలు, వివేకానందలాంటి వారి ఆంగ్ల ఉపన్యాసాల వల్లే భారతీయ సంస్కృతి బైటి ప్రపంచానికి వెళ్లిందన్న ప్రచారం ఎక్కువ. నిజానికి పాశ్చాత్యుల అనువాదాలు భారతీయుల దృక్పథాన్ని మార్చేశాయి, క్రైస్తవీకరించాయి, వలసీకరించాయి. పాశ్చాత్య అనువాదకులు గీత గోవిందం, శాకుంతలం లాంటి గ్రంథాలలో శృంగార అంశాల్ని తొలగించి, క్రైస్తవ ప్యూరిటన్ నీతిని ప్రవేశపెట్టారు. మనుస్మృతి అనువాదం ద్వారా మౌఖికంగా బహుళం గా వున్న న్యాయవ్యవస్థని రికార్డుగా కుదించారు.

నిజానికి బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమాలు బ్రాహ్మణులతో పోటీ పడడంతో ప్రారంభమయ్యాయి. ఏవిషయంలో పోటీ, వలసీకరించడడంలో, క్రైస్తవీ కరించడడంలో పోటీ. ఇంగ్లీషువాళ్లు గుమాస్తా విద్య ద్వారా బ్రాహ్మణుల్ని ఉద్యోగస్తులుగా కుదించారు. నూతన అస్తిత్వం ఉద్యోగస్వామ్యం శూద్రులని కూడా ఆకర్షించింది. కర్ణాటకలో బ్రాహ్మణులు

మొదట బెంగుళూరు లాంటి పట్టణాలకి జేరుకొని బ్రిటీష్ కొలువులలో జేరారు. తరువాత లింగాయతులు అదే బాట పట్టారు. నిజానికి లింగాయతులు ఆస్తిపరులు. కాని ఉద్యోగస్వామ్యం వాళ్లని ఆకర్షించింది అదే బ్రాహ్మణ వ్యతిరేకతకి కారణమైంది.

యిప్పటికీ యిదే సంఘర్షణ కొనసాగుతోంది. అందరూ ఉద్యోగులుగా మారాలని అనుకొంటున్నారు. కాని ఆధునికత వృత్తులని ధ్వంసం చేస్తూ పోతోంది. కాని ప్రత్యామ్నాయాన్ని కల్పించడంలో విఫలమౌతూ వస్తోంది. యీలోగా కుల వృత్తులు అన్నీ అగ్రవర్ణ పరమౌతున్నాయి. ఆధునిక రూపంలో అగ్రవర్ణ పరమౌతున్నాయి. ఉదాహరణ కి – బ్యూటి పార్లర్ పేరుతో మంగలి వృత్తి డబ్బున్న అగ్రవర్ణాల చేతికి చిక్కుతోంది యిలాగే అన్నీ. కుల వృత్తుల కబ్జా గురించి ఎవరూ మాట్లాడడం లేదు. ఎందుకంటే నగరీకరించబడిన మధ్యతరగతిగా మారిన వివిధ కులస్తులు దళితులతో సహా ఆయాకులాల ప్రతినిధులుగా, గొంతు విప్పుతున్నారు. వాళ్లు తమ పాక్షిక ప్రయోజనాలనే ప్రతిబింబిస్తున్నారు.

వలస వాదం సృష్టించిన వుద్యోగులూ, మధ్య తరగతీ సామాజిక విధ్వంసానికి ముసుగుగా పని చేస్తున్నారు. వీళ్ళే హిందూత్వ వాదులుగా, దళిత వాదులుగా, ప్రగతిశీలురుగా అవతార మెత్తుతున్నారు.

అందువల్లనే వీళ్ల భాషలో, వ్యక్తీ కరణలో ఏక సూత్రత కనిపిస్తుంది. వలస సామ్రాజ్యవాద అనుకూలత రాజ్యం చేస్తుంది. వీళ్లకి సమాధానం స్థానిక మౌఖిక సంస్కృతుల నుంచే లభిస్తుంది.

"నేను యింగ్లీషులో రాయను నా మాతృభాషలోనే రాస్తాను" అని ప్రకటించిన గుగీవాధియాంగోని విరసం వాళ్లు పిలిచి సభలు జరిపారు. అభిమానం ప్రకటించారు. కాని యెటువంటి స్ఫూర్తినీ పొందలేదు. వలసవాద విమర్శ మన కమ్యూనిస్టులలో కానరాదు.

చిను అబాబే, గుగీవాధియాంగో వంటి వారు మన తెలుగు మేధావులలో అసలే కానరారు. వొక కమ్యూనిస్టు నాతో అన్నాడు. ఆఫ్రికా గిరిజన సమాజం. మనని వారితో పోల్చుకోలేము అని. కాని కర్నాటక గిరిజన సమాజం కాదు. అక్కడ వలసవాద దృక్పథాన్ని తాత్వికంగా విశ్లేషించి విమర్శించిన దళిత మేధావి డిఆర్ నాగరాజు వున్నారు. మాతృభాష పరిరక్షణని కన్నడ రచయితలందరూ (దళిత రచయితలతో సహా) వొక వుద్యమంగా భావిస్తున్నారు.

తెలుగు భాష పరిరక్షణ అగ్రవర్ణ రాజకీయంగానే కాదు, హిందూ రాజకీయంగా భావించబడ్తోంది. దళితులు ఎవరూ ఆసక్తి చూపడం లేదు. కన్నడ భాష అనేది వీరశైవంతో ముడి పడి వుంది. అది 'హిందూత్వ' అనే ఆధునిక ఫాసిస్టు ఐక్యతకి విరుద్ధంగా నిలబడింది.

తెలుగుకి ఆశక్తి లేకపోవడమే కాదు. తెలుగు అనేది మొదలు కమ్యూనిస్టుగా వుండి క్రమేపీ ప్రాంతీయ పార్టీగా మారిన వొక కులంకి మారుపేరు. ఆ కులం ఎదిగే క్రమంలో దళితులపై దాడులు చేసింది కూడా. ఆ శూద్ర కులం సకల వ్యాపార రంగాలలోకి ప్రవేశించడమే కాదు, బౌద్ధిక సాంస్కృతిక రంగాలని శాసించే స్థాయికి యెదిగింది. సినిమాలు, వార్తా పత్రికలు ఆ కులం చేతిలోనే వున్నాయి. ఆంధ్ర దేశాన్ని అమెరికా సామ్రాజ్య వాద భావ జాలానికి రంగంగా మార్చింది ఆ కులం. తెలుగు భాష అంటే కృష్ణా గుంటూరు జిల్లాల భాష అని ప్రసిద్ధి. క్రమేపీ ఆ కుల పార్టీ, బీజేపీ తో చేతులు కలిపింది.

ఐతే కర్ణాటకతో పోలిస్తే ఆంధ్ర దేశంలో సాపేక్ష ప్రశాంతత కనబడ్తుంది. కర్ణాటకలో కల్బుర్గి, గౌరీలంకేష్ హత్యలు జరిగాయి. సాంస్కృతిక దాడులు జరిగాయి. కాని యిక్కడ ఆ స్థాయి కనబడదు. దానికి కారణం తెలుగువాళ్లు తెలుగువాళ్ల మానసిక స్థాయిని మార్చిన వొక శూద్ర కులం తెలుగు వాళ్లని పచ్చి ప్రాగాటిస్టులుగా మార్చింది. ఆవిధంగా వలస ఆధునికతలో భాగం చేసింది. యీ ఆధునికతని చేరుకోవడానికి కమ్యూనిస్టు భావజాలం అక్కరకు వచ్చింది. ఎందుకంటే కమ్యూనిస్టులకి మొదటినుంచి వలసవాదం పీడితులకి కొంత వెసులుబాటునీ, స్వేచ్ఛనీ యిచ్చిందన్న భావన వుంది. అందువల్ల వలసపెట్టుబడిదారీ విధానంపై మనకి విమర్శ శూన్యం.

కర్ణాటక పరిస్థితి వేరు. అక్కడ రామ్ మనోహర్ లోహియా ప్రభావం వుంది. అది సాంస్కృతిక విమర్శని సాధ్యం చేసింది. ఆధునికతపై విమర్శని ఎక్కు పెట్టింది. గతాన్ని వలసవాద దృష్టితో తృణీకరించే పాపానికి దిగజారలేదు.

ఐతే తెలుగునాట సాంస్కృతిక దాడులు పెద్దగా కానరావు. కాని విద్యార్థుల ఆత్మహత్యలు తెలుగు దేశపు వలస ఆధునికతని సూచిస్తాయి. సృజనాత్మకతా రాహిత్యాన్ని బయటపెట్టాయి. మరి మనకి కర్ణాటకలోలా నాటకం లేదు, ప్రత్యామ్నాయ సినిమా లేదు. సర్వం వ్యాపారమయం, లాభమే పరమార్థం.

యీ సాంస్కృతిక నేపథ్యంలో చూసినపుడు 'కన్నడ'లా తెలుగు హిందూత్వ ఫాసిజానికి ఎదురుగా తన ప్రత్యేకతల్ని నిలిపే శక్తి కలిగిలేదు. పైగా లొంగుబాటుకి సిద్ధంగా వుంది. అందువల్ల తెలుగు భాష ఉద్ధరణ హిందూ వాదానికి మారుపేరుగా మారే ప్రమాదం వుంది.

అందువల్లనే, ఎవరికీ తెలుగు పట్ల ప్రేమలేదు. మాతృభాష అభిమానం శూన్యం. ఆంగ్లీకరణే దీనికి కారణం. యీ ఆంగ్లీ కరణ బ్రాహ్మణీకరణకి అంటే హిందూత్వకి

దగ్గరదారి. ప్రత్యక్షంగా హిందూ పార్టీ పరిపాలనలోకి రాకపోయినా, మనవాళ్లు చంద్రబాబునాయుడు, పవన్ కళ్యాన్, జగన్ వంటి వాళ్లు హిందూ రాజకీయ నాయకుల మన్ననలు పొందడానికి కారణం అదే. తెలుగు వార్తా పత్రికలు హిందూత్వ దాస్యం చేస్తున్నాయి.

కంచ ఐలయ్య గారిని తెలుగు మేధావిగా భావించలేము. ఆయన భాషగా తెలుగుకి ప్రాధాన్యం యివ్వరు. ఆంగ్లంలో రచించడానికే యిష్ట పడ్తారు. ఆంగ్లాన్ని పాశ్చాత్యాన్నీ కీర్తిస్తాడు. ఆయన కమ్యూనిస్టు నేపథ్యంగల పౌర హక్కుల సంఘాలలో పనిచేయడం యాదృచ్ఛికం కాదు. మనకి డి.ఆర్. నాగరాజు, గుగీవాధియాంగోలలా సాంస్కృతిక భాషాపర వుద్యమ కారులు వుండడం అసాధ్యం. మనం వలసవాదం వల్ల తీవ్రంగా ప్రభావితమయ్యాం. అందువల్ల 'హిందూత్వ' వల్ల ప్రమాదం మనకే ఎక్కువ.

హిందూత్వని ఎదుర్కోవడానికి సాంస్కృతిక భాషా పర ప్రత్యేకతల పునరుజ్జీవనం అత్యవసరం.

తెలుగు కవి జాషువా కులాధిపత్యం పైనే కాదు ఆంగ్లభాష ఆధిపత్యం పైన కూడా తిరుగుబాటు చేశాడు.

అందువల్ల మనవైన సాంస్కృతిక ప్రతీకల్ని కనుగొనవలసివున్నది.

"ఆయారాం, గయారాం, షియారాం కాదు తెలుగు రాముడు మనవాడు అద్దంలో జాబిలితో అల్లరిమానాడు."

విశ్వనాధ సత్యనారాయణ తెలంగాణాకు చెందిన హిందూస్తానీ విద్వాంసుడు 'నారాయణరావు' జీవిత చరిత్రని మ్రోయుతుమ్మెద అనే పేరుతో నవలగా రాశారు. ఈ నవలలో నాయకుడైన నారాయణ రావుని వొక హిందూస్థానీ విద్వాంసుడు నీవు పాడే విధానం తురక పద్ధతిలో వుంది' అంటాడు. "ముస్లిం లేకుండా హిందూస్థానీ వుందా" అని ఎదురు ప్రశ్నవేస్తాడు నారాయణ రావు.

యీనవలలో వొక కథని ప్రస్తావిస్తాడు విశ్వనాధ. "హిందూస్తానీ కళాకారుడు తాన్‌సేన్ చనిపోయాడు. ఆయనకి యిద్దరు కుమారులు వున్నారు. వొకడు ముస్లిం. మరొకడు హిందువు. మరి భిన్న మతాలకి చెందిన భార్యలు వున్నారు ఆయనకి. సూర్యసేనుడు, విలాస్ ఖాన్ అనే కొడుకులిద్దరూ శవసంస్కారం తమ ఆచారం ప్రకారం తాము చేస్తామంటూ పరస్పరం పోట్లాడుకొన్నారు. అప్పుడు పెద్దలు వొక వుపాయం చెప్పారు. ఎవరి సంగీతం విని శవం లేచి కూచుంటుందో ఆ కొడుకుకే శవందక్కుతుంది. విలాస్‌ఖాన్ తోడిరాగం విని శవం లేచింది".

యీ కథ భిన్న సంస్కృతుల విచిత్ర సమ్మేళనాన్ని తెలియజేస్తుంది. హిందూస్తానీ సంగీతం భక్తికీ, కర్ణాటక సంగీతం అద్వైతానికీ ప్రాధాన్యం యిస్తుందంటారు విశ్వనాథ. బహుశా ఇస్లాం ద్వైత మత ప్రభావం హిందూస్తానీలో భక్తి ప్రాధాన్యానికి కారణం కావచ్చు.

యిప్పుడు మన జనాభా లెక్కల ప్రకారం తాన్‌సేన్ హిందువా, ముస్లిమా? పురాణ దేవీదేవతల స్తోత్రాలు గానం చేసిన హిందూస్తానీ కళాకారులు ముస్లిములా, హిందువులా, రెండూనా ? సంస్కృతుల్ని స్థిరీకరించడం, నిర్ధారించడం, వర్గీకరించడం ఎలా సాధ్యం.

ప్రగతి శీలురుగా గుర్తింపు పొందిన చరిత్రకారులు, మేధావులూ కూడా సులభ వర్గీకరణకి పాల్పడ్డారు. బైనరీ అపోజిట్స్‌ని సృష్టించాలని చూశారు. చరిత్రకారిణి రొమిల్లా థాపర్ చేసింది యిదే. మొత్తం ప్రాచీన చరిత్రని బ్రాహ్మణ–శ్రమణ సంప్రదాయాలుగా వర్గీకరించి విమర్శించారు. శ్రమణులు (బౌద్ధులు) హేతుబద్ధతకి సంకేతం. బ్రాహ్మణులు మాయావాదాన్ని సృష్టించారు అంటారు. నిజానికి మహాయాన బౌద్ధులే మాయావాదాన్ని అభివృద్ధి పరిచారు. కుమారిలుడు అనే మీమాంసా పండితుడు, బ్రాహ్మణుడు మాయావాదాన్ని పూర్తిగా ఖండించాడు. ప్రపంచం సత్యం అన్నాడు. దేవుణ్ణి కూడా నిరాకరించాడు. మొత్తం చరిత్రని బ్రాహ్మణ–బ్రాహ్మణేతర (శూద్ర క్షత్రియ) ఘర్షణగా చూపడం వలస వాద పద్ధతి. యీ పద్ధతివల్ల 'హిందూత్వ' ని అర్థం చేసుకోవడం కష్టమౌతుంది.

కుల వ్యవస్థని మొత్తం బ్రాహ్మణ కేంద్రంగా చూడడం అలవాటైన ఆధునిక పద్ధతి. ఇర్ఫాన్ హబీబ్ యీ పద్ధతిని ఖండించాడు. అసలు కుల వివక్షకి మూలాలు బౌద్ధ సిద్ధాంతాలలోనే వున్నాయి అన్నాడు. కర్మ సిద్ధాంతం, అహింసావాదం కుల వివక్షకి దోహదం చేశాయి అన్నాడు. బౌద్ధం ఒక మతం. అందువల్ల శ్రీలంకలో, బర్మాలో రాజ్యమతంగా మారి నియంతృత్వాన్ని నెరపింది. కానీ భారతదేశంలో ఒకే ఒక మతంలేదు. కనుక ఆ ప్రమాదం లేదు.

అందువల్ల బ్రాహ్మణ–బ్రాహ్మణేతర బైనరీ ఆపోజిట్స్‌ని సృష్టించి, చరిత్రని సులభంగా వ్యాఖ్యానించవచ్చు. యింకా ప్రాచీన గతమే సనాతన సంస్కృతే హిందూత్వగా కొనసాగుతోందని వాదించే మేధావులు, ఎక్కువగానే వున్నారు. కాని యిటువంటి వాదనలు హిందూత్వకి బలం చేకూరుస్తాయి. 'హిందూత్వ' వయసుని పెంచుతాయి. హిందూత్వని స్థానికీకరిస్తాయి. నిజానికి హిందూత్వకి స్థానిక సంస్కృతి సంప్రదాయ పరంపరతో సంబంధం లేదని తెలిసినపుడు, హిందూత్వలో దాగిన పాశ్చాత్య సామ్రాజ్య వాదలక్షణాలు బయటపడ్తాయి. దానితో స్థానిక ప్రజలతో దాని సంబంధం తెగి పోతుంది. హిందూత్వ మరణిస్తుంది.

ఆధునిక కులతత్వానికి ప్రాచీన కులాలతో సంబంధం లేదు. బ్రిటిష్ జనాభా గణన అనంతరం కులాలు పూర్తిగా ఘనీభవించి పోయాయి. బ్రిటీష్ వారు హిందూ-ముస్లిం అని కమ్యూనిటీలని నిర్ధారించడమే కాదు, అన్ని కులాలను నాలుగు వర్ణాలు బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులుగా విభజించివేశారు. నిజానికి గ్రంథస్థంగా మాత్రమే వున్న వర్ణ విభజనని వ్యవస్తీకరించారు. అలాగే కొన్ని కులాలని క్రిమినల్ కులాలుగా, మరి కొన్ని కులాలని యుద్ధ కులాలుగా వర్గీకరించారు, స్థిరపరిచారు. యింత స్పష్టమైన విభజనని రాజ్యం కల్పించుకొని చేయడం అనేది బ్రిటీషుకాలంలోనే జరిగింది.

నిజానికి మతం రాజకీయ అవసరంగా వర్ధిల్లుతూందే కాని దానిలో మత పరత్వం ఏమీ లేదు. వల్లభాయి పటేల్ విగ్రహం గురించి దేశవ్యాప్త ప్రచారం, నిధుల సేకరణ చూస్తే యీ విషయం తెలుస్తుంది. హిందూ అనేది ప్రధానంగా ఒక రాజకీయ సమీకరణ. యీ రాజకీయ సమీకరణలో రాముడి కన్న వల్లభాయిపటేల్ కాని మరొకరు కాని మరింత అవసరం అనుకొంటే వారి విగ్రహారాధన మొదలవుతుంది.

హిందూత్వ దృక్పథం ఏమాత్రం వైవిధ్యం లేనిది, ఏక శిలాసదృశమైనది. యీ మాట సారంలో నిజమే కాని వైవిధ్యాన్ని బహుళత్వాన్ని ముసుగుగా ధరించక తప్పని పరిస్థితి వుంది. దానికి కారణం భారత ఖండం సహజ సిద్ధంగానే వైవిధ్యభరిత సంస్కృతులతో నిండినది.

భారతదేశంలో హిందూ ఫాసిస్టు భావాలు వలసవాదంతో, వలసవాద భావజాలంతో మిలాఖత్తు అయ్యాయి. జర్మనీలో ఫాసిస్టు నేషనలిజంలా హిందూ నేషనలిజంకి సొంత మూలాలు లేవు. యూరో భావ బానిసత్వం నుంచి హిందూ ఫాసిజం పుట్టింది. ఫాసిస్టు అడుగు పెట్టిన చోట సంభాషణ నిలిచిపోతుంది. భాష మరణిస్తుంది కనుక ఫాసిస్టులు ప్రగతిశీల రచయితల నుంచే తమ భావజాలాన్ని రూపొందించుకుంటారు. దాన్ని డైనమిక్‌గా అమలుచేస్తారు. ఫాసిస్టులు కార్యశూరులు, వారు ఆలోచనలతో పాడ్డు పుచ్చరు.

నిజానికి ఆధునికత తీసుకువచ్చిన యూనివర్సలిజం ప్రకారం అందరు మనుషులు అన్ని జాతులూ వొకటే, అన్ని సంస్కృతులూ వొకటే. ప్రత్యేకతల్ని నశింపజేసి, అందరినీ వొకే జాతిగా తీర్చిదిద్దాలనే భావన యూరోపీయ ఆధిపత్యానికి, శ్వేత జాతి ఆధిపత్యానికీ దారితీసింది. దీనిపై ఆఫ్రికన్ మేధావులు చిను అబాబె, గుగీవంటి వారు తిరుగుబాటు చేశారు.

హిందూత్వ అనేది ప్రకృతి వ్యతిరేకమైనది. మానవ కేంద్రకమైన పెట్టుబడిదారీ వ్యవస్థనుంచి, వలసవాద భావజాలం నుంచి పుట్టింది. అందుకే యీ నాగరీకత మరింత పురోగమించేకొలదీ హిందూత్వ బలపడ్తూవచ్చింది. గ్లోబలైజేషన్ యుగంలోనే సామాజిక రాజకీయ శక్తిగా అవతరించింది.

■

**భిన్న స్వరాలు**
సాహితీ సాంస్కృతిక వేదిక, తెనాలి.